ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
3


ఊరికి దూరంగా పట్టా... నిర్మాణాలు ఎట్టా..?

వజ్రగడలో జగనన్న ఇళ్ల కాలనీ లబ్ధిదారుల ఆవేదన

- రెండేళ్లు గడుస్తున్నా ఒక్క పునాదీ పడని వైనం
- కొండ ప్రాంతంలో స్థలాలు కేటాయించడమే కారణం

- వార్త 5వ పేజీలో..

తాడి.. కాలుష్యంతో తల్లడిల్లి..



తాడి పంచాయతీ పరిధిలోని గ్రామాలు
పెదతాడి, చినతాడి, తాడి బీసీ కాలనీ
విస్తీర్ణం : సుమారు 25 ఎకరాలు
ఓటర్లు : 1390
మొత్తం జనాభా... సుమారు : 2700 మంది
మొత్తం కుటుంబాలు : 790

ఫార్మాసిటీ కాలుష్యంతో గ్రామస్థులు ఉక్కిరిబిక్కిరి

- గ్రామాన్ని తరలించాలని 15 ఏళ్లుగా పోరాటం
- గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు
- వైసీపీ అధికారంలోకి వచ్చాక మీనమేషాలు
- గ్రామాన్ని తరలిస్తామని రెండేళ్ల క్రితం సీఎం జగన్ హామీ
- ఇప్పటికి ఎటువంటి చర్యలు చేపట్టని వైనం
- మండిపడుతున్న గ్రామస్థులు
- సార్వత్రిక ఎన్నికలను బహిష్కరించాలని నిర్ణయం


ఫార్మా కాలుష్యంతో కలుషితమైన బావినీరు

పరవాడ, మార్చి 28:

ఫార్మాసిటీ కాలుష్య కోరల్లో చిక్కుకుని తాడి గ్రామస్థులు విలవిల్లాడిపోతున్నారు. భరించలేని దుర్వాసన, తరచూ పరిశ్రమల్లో జరుగుతున్న ప్రమాదాలతో భయం భయంగా గడుపుతున్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో గ్రామాన్ని తరలించడానికి జీవో జారీ చేసి నిధులు కూడా కేటాయించింది. ఇంతలో ఎన్నికలు జరగడం, వైసీపీ అధికారంలోకి రావడంతో దీనికి బ్రేక్ పడింది. అయితే రెండేళ్ల క్రితం ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఈ గ్రామాన్ని తరలిస్తామని హామీ ఇచ్చారు. కానీ ఇంత వరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదు. దీంతో గ్రామస్థులు మండిపడుతున్నారు. సార్వత్రిక ఎన్నికలను సైతం బహిష్కరించడానికి సిద్ధమవుతున్నారు.

ఫార్మా కాలుష్యంతో తాడి పంచాయతీ పరిధిలోని పెదతాడి, చినతాడి, తాడి బీసీ కాలనీల ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. భూగర్భ జలాలు సైతం కలుషితం కావడంతో తాగునీటికి అల్లాడిపోతున్నారు. కొందరు గత్యంతరం లేక కొళాయి నీరు తాగి అనారోగ్యానికి గురవుతున్నారు. చాలా మంది మోకాళ్ల నొప్పులతో నడవ లేని స్థితిలో మంచాన పడుతున్నారు. సురక్షిత తాగునీరు అందుబాటులో లేక లంకెలపాలెం, అగనంపూడి, పరవాడ తదితర ప్రాంతాల నుంచి మినరల్ వాటర్ క్యాన్లు కొనుగోలు చేసి ఆటోల్లో తెచ్చుకోవాల్సి వస్తుందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి వేళ వాతావరణం చల్లగా ఉన్నప్పుడు, వర్షాలు కురిసే సమయంలో కాలుష్య ప్రభావం మరింత తీవ్రంగా ఉండడంతో తలుపులు మూసుకున్నా ఇళ్లల్లో ఉండలేకపోతున్నామని వాపోతున్నారు. స్థానికుల్లో ఎక్కువ శాతం మంది శ్వాసకోశ సమస్యలతో బాధపడుతున్నారని చెబుతున్నారు. దీనికి తోడు ఫార్మా పరిశ్రమల్లో సంభవిస్తున్న ప్రమాదాలు ప్రజలను భయాందోళనకు గురి చేస్తున్నాయి. ఏ సమయంలో ఎటువంటి ఉపద్రవం ముంచుకొస్తుందోనని భయం భయంగా కాలం గడుపుతున్నారు. ఫార్మాసిటీలోని పరిశ్రమల కాలుష్యంతో నరకయాతన అనుభవిస్తున్నా ఫార్మాసిటీ యాజమాన్యం గాని, ప్రభుత్వ యంత్రాంగం గాని పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. అభివృద్ధి పనులతో పాటు ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు ఫార్మాసిటీ యాజమాన్యం సీఎస్ఆర్ నిధులు వెచ్చించే అవకాశమున్నప్పటికీ ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

15 ఏళ్లుగా పోరాటం

గ్రామాన్ని తరలించాలని గత 15 ఏళ్లుగా ఈ ప్రాంతవాసులు ఆందోళనలు చేస్తున్నారు. తాడి గ్రామం తరలింపు కోసం అప్పటి ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి 2012లో నిరాహరదీక్ష చేపట్టారు. కాగా గత టీడీపీ ప్రభుత్వం తాడి పంచాయతీని తరలించేందుకు 2019 ఫిబ్రవరిలో జీవో నంబరు 28ను విడుదల చేసింది. ఫార్మా కాలుష్యం నుంచి తాడి పంచాయతీ పరిధి గ్రామాలను తరలించేందుకు రూ. 59 కోట్లు విడుదల చేసింది. దీని కోసం ప్రత్యామ్నాయంగా పెదముషిడివాడలో లేఅవుట్ అభివృద్ధి చేసింది. ఇంతలో ఎన్నికల కోడ్ రావడంతో ఆ ప్రక్రియ నిలిచిపోయింది. ఎన్నికల అనంతరం అధికారంలోకి వచ్చిన వైసీపీ గ్రామాన్ని తరలించేందుకు మీనమేషాలు లెక్కిస్తోంది.

హామీ ఇచ్చి మరిచిన సీఎం జగన్

తాడి గ్రామాన్ని తరలిస్తామని 2022 ఏప్రిల్ 28న ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి సబ్బవరం మండలం పైడివాడ అగ్రహారంలోని ఇళ్ల పట్టాల పంపిణీ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో హామీ ఇచ్చారు. అయితే రెండేళ్లు అవుతున్నా గ్రామం తరలింపునకు ఎటువంటి చర్యలు చేపట్టలేదు. సీఎం ఇచ్చిన హామీ నెరవేరకపోవడంపై గ్రామస్థులు మండిపడుతున్నారు. కాగా కాలుష్యం నుంచి తమకు ఉపశమనం కల్పిస్తామన్న హామీని వైసీపీ పాలకులు నెరవేర్చనందుకు నిరసనగా ఎన్నికలను బహిష్కరించాలని నిర్ణయం తీసుకున్నట్టు తాడి గ్రామస్థులు బుధవారం ప్రకటించారు. ఈ మేరకు గ్రామస్థులంతా కలిసి ఏకగ్రీవంగా తీర్మానం చేసుకున్నారు.

కాళ్లు చచ్చుబడి నడవలేకపోతున్నా



కలుషిత గాలిని పీల్చడంతో ఊపిరితిత్తులు పాడయ్యాయి. దీనికి తోడు కాళ్లు చచ్చుబడిపోవడంతో నడవలేకపోతున్నాను. ఇంటి నుంచి బయటకు వెళ్లాలంటేనే నరకయాతన పడాల్సి వస్తుంది. గ్రామాన్ని తరలించాలని ఏళ్ల తరబడి వేడుకుంటున్నా పట్టించుకునే నాథుడే లేకపోయారు. నాలాగే చాలా మంది వ్యాధులతో సతమతమవుతున్నారు. ప్రభుత్వం పట్టించుకుని గ్రామాన్ని తరలించేందుకు చర్యలు చేపట్టాలి.

- కలము సన్యాసిరావు, తాడి బీసీ కాలనీ

నా ఆరోగ్యం పాడైంది



ఫార్మాసిటీ నుంచి వెలువడుతున్న కాలుష్యపూరిత గాలిని పీల్చడం వల్ల ఊపిరాడడం లేదు. కలుషిత నీరు తాగడంతో నరాలు చచ్చుబడిపోయాయి. ఫార్మా పరిశ్రమలు ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నాయి. గ్రామస్థులు అనారోగ్యాలతో సతమతమవుతున్నారు. గ్రామాన్ని తరలిస్తామన్న జగన్ హామీ నెరవేర్చలేకపోయారు. ఇంకా ఎన్నాళ్లు ఈ నరకకూపంలో బతకాలి.

- మాదంశెట్టి దేముడమ్మ, తాడి బీసీ కాలనీ

బాదుడే బాదుడు



సంవత్సరం	ఆస్తి పన్ను డిమాండ్
2018-19	రూ.280 కోట్లు
2019-20	రూ.285 కోట్లు
2020-21	రూ.300 కోట్లు
2021-22	రూ.321 కోట్లు
2022-23	రూ.358 కోట్లు
2023-24	రూ.395 కోట్లు

ఎడాపెడా ఆస్తి పన్ను పెంపు

- చట్టాన్ని మార్చేసిన వైసీపీ ప్రభుత్వం
- 2021 ద్వితీయ అర్ధ భాగం నుంచి ఆస్తి విలువ ఆధారంగా పన్ను విధింపు
- ఏటా 15 శాతం వరకూ వడ్డింపు
- ఆరేడేళ్లలో రెట్టింపు కానున్న ఇంటి పన్ను
- ఇంటి అద్దెలపై తీవ్ర ప్రభావం
- సామాన్య, మధ్య తరగతికి తప్పని ఇబ్బందులు
- జీవీఎంసీ పరిధిలో ఏడాదికి రూ.100 కోట్ల మేర బాదుడు

(విశాఖపట్నం- ఆంధ్రజ్యోతి)

విశాఖలోని చినగంట్యాడకు చెందిన కె.రవికిరణ్‌కు రెండు పడక గదుల ఇల్లు (అసెస్‌మెంట్ నంబర్ 1086261943) ఉంది. 2020-21లో ఏడాదికి ఇంటి పన్ను కింద సుమారు రూ.15 వేలు చెల్లించేవారు. ఆస్తి మూలవిలువ ఆధారంగా పన్ను విధించడంతో ఇప్పుడు రూ.20 వేలు పన్ను కట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది.

విశాఖ పీఎం పాలెంలోని బీసీ కాలనీలో తిరుమలదేవి తన ఇంటికి (అసెస్‌మెంట్ నంబర్ 100008/81816) 2021 వరకూ ఏడాదికి రూ.1,120 ఇంటి పన్ను చెల్లిస్తే కొత్త విధానం అమల్లోకి రాగానే రూ.1,780కి పెరిగింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.2,100కి పెరిగే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.



వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత పట్టణ ప్రాంతాల్లో ఇంటి పన్ను భారీగా పెంచేసింది. గతంలో మాదిరిగా అద్దె ప్రాతిపదికన కాకుండా ఆస్తి మూల విలువ ఆధారంగా పన్ను విధించింది. దీనివల్ల ఆస్తి పన్ను రెండింతలు పెరిగిపోయింది. ఆస్తి పన్ను పెంపుతో ఇంటి యజమానులు అద్దెలు కూడా అదేస్థాయిలో పెంచడంతో సామాన్య మధ్య తరగతి ప్రజలు గగ్గోలు పెడుతున్నారు.

జీవీఎంసీ పరిధిలో ప్రస్తుతం నివాస, నివాసేతర భవనాలతోపాటు ఖాళీ స్థలాలకు సంబంధించి 5,72,356 అసెస్‌మెంట్లు ఉన్నాయి. వీటి ద్వారా ఏటా దాదాపు రూ.395 కోట్లు ఆస్తి పన్ను వసూలవుతుంది. 2021 ఆగస్టు వరకూ నివాస, నివాసేతర భవనాలకు వార్షిక అద్దె ఆధారంగా జీవీఎంసీ ఆస్తి పన్ను విధించేది. అయితే కేంద్ర ప్రభుత్వం మార్గదర్శకాలంటూ సాకుగా చూపించి రాష్ట్ర ప్రభుత్వం ఆస్తి పన్నును భారీగా పెంచాలని నిర్ణయించింది. వార్షిక అద్దె ఆధారంగా కాకుండా, ఆస్తి మూల విలువ (స్థలం విలువతోపాటు నిర్మాణ వ్యయం కలిపి) ఆధారంగా పన్ను విధించేలా చట్టాన్ని సవరించింది. దీని ప్రకారం నివాస భవనాలకు ఆస్తి విలువలో 0.12 శాతం, నివాసేతర భవనాలకు 0.30 శాతం, ఖాళీ స్థలాలకు 0.50 పన్ను విధించేలా మార్గదర్శకాలు రూపొందిస్తూ జీవో నంబర్ 198 విడుదల చేసింది. ఈ మేరకు 2021 ఆర్థిక సంవత్సరం రెండో అర్థ భాగం నుంచే కొత్త విధానాన్ని అమలుచేసేలా తీర్మానం చేయాలని జీవీఎంసీ కౌన్సిల్‌ను ఆదేశించింది. రాష్ట్ర ప్రభుత్వం సూచన ఆధారంగా 2021 ఆగస్టు ఏడున జీవీఎంసీ కౌన్సిల్ ప్రత్యేక సమావేశం నిర్వహించి ఆస్తి పన్ను సవరణ చట్టాన్ని ఆమోదించింది. కొత్తవిధానం వల్ల అద్దెలు పెరిగిపోయి సామాన్యులు, కూలీలు, ప్రైవేటు ఉద్యోగాలు చేసుకునే వారంతా ఇబ్బందులు పడతారంటూ విపక్షాలు అభ్యంతరం తెలపడంతోపాటు, ప్రతిపాదనను రెండేళ్లపాటు వాయిదా వేయాలంటూ ఆందోళనకు దిగాయి. అయినప్పటికీ మేయర్ గొలగాని హరివెంకటకుమారి మాత్రం కౌన్సిల్‌లో వైసీపీ సంఖ్యాబలం ఉండడంతో ఏకపక్షంగా తీర్మానాన్ని ఆమోదిస్తున్నట్టు ప్రకటించేశారు. దీంతో 2021 రెండో అర్థ సంవత్సరం నుంచే కొత్త ఆస్తి పన్ను చట్టం అమల్లోకి వచ్చినట్టయింది. కొత్త ఆస్తి పన్ను విధానంలో స్థలం విలువ, ఆ ఇల్లు నిర్మించడానికి అయ్యే వ్యయాన్ని వేర్వేరుగా లెక్కిస్తారు. మొత్తం వచ్చిన విలువలో 0.12 శాతాన్ని ఆస్తి పన్నుగా చెల్లించాల్సి ఉంటుంది. ఇలా లెక్కిస్తే ప్రతి అసెస్‌మెంట్‌కు పన్ను రెట్టింపు లేదా అంతకంటే ఎక్కువ కట్టాల్సి వస్తుంది. ఒకేసారి ఆస్తిపన్నును రెట్టింపు మొత్తంలో కట్టాలని డిమాండ్ నోటీసు ఇస్తే ప్రజల నుంచి తిరుగుబాటు వస్తుందని గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం తెలివిగా ఏడాదికి 15 శాతం చొప్పున కొత్త విధానంలో చెల్లించాల్సిన మొత్తానికి సమానమయ్యేంత వరకూ పెంచుకుంటూ వెళ్లాలని నగర పాలక సంస్థకు సూచించింది. ఒకవేళ అప్పటికే చెల్లిస్తున్న పన్నుకు కొత్త విధానంలో పెరిగే పన్నుకు వ్యత్యాసం పెద్దగా లేదనుకుంటే ఏటా రెండు, ఐదు శాతం చొప్పున మాత్రమే పెంచుకుంటూ వెళ్లాలని నిర్ణయం తీసుకుంది.

రెండున్నరేళ్లలో రూ.115 కోట్లు పెరిగిన పన్ను ఆదాయం

జీవీఎంసీ 2018-19లో రూ.280 కోట్లు ఆదాయం సమకూరగా, 2019-20లో రూ.285 కోట్లు, 2020-21లో రూ.300 కోట్లు పన్నుల రూపంలో సమకూరింది. 2021-22 రెండో అర్థ సంవత్సరం నుంచి కొత్త ఆస్తిపన్ను విధానం అమలుచేయడంతో ఆ ఏడాది రూ.21 కోట్లు ఆదాయం పెరిగింది. రూ.321 కోట్లు వరకూ వచ్చింది. ఇక 2022-23లో ఏకంగా రూ.358 కోట్లకు చేరగా, 2023-24లో రూ.395 కోట్లు వసూలవుతుందని అంచనా వేస్తున్నారు.

పెరిగిన అద్దెలతో సామాన్యులు సతమతం

జీవీఎంసీ అధికారులు ఆస్తి పన్నును ఏటా పెంచేస్తుండడంతో ఇంటి యజమానులు తమ ఇళ్ల అద్దెలను కూడా ... మిగతా 6వ పేజీలో

ఏటా 15 నుంచి 20 శాతం పెంపు దారుణం



2019కి ముందు మూడేళ్లకో, ఐదేళ్లకో ఇంటి పన్ను పెంచేవారు. 2021 తర్వాత పరిస్థితి పూర్తిగా మారింది. ఏటా నియంతృత్వ ధోరణితో సుమారు 15 నుంచి 20 శాతం ఇంటి పన్ను పెంచుకుంటూ పోతున్నారు. డిమాండ్ నోటీసులు ఇచ్చి కట్టాల్సిందిగా వేధిస్తున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో విధి లేక చెల్లిస్తున్నాం. సామాన్య మానవులకు ఇంటి పన్ను పెంచాల్సిన అవసరమేముంది. మార్చి 31లోపు ఇంటి పన్ను చెల్లించకపోతే ఏప్రిల్ ఒకటో తేదీనే వడ్డీ వేస్తున్నారు. సామాన్యులను వేధించుకు తినడమే ఈ ప్రభుత్వం పనిగా పెట్టుకున్నట్టుంది. కరెంటు బిల్లులు, బస్సు చార్జీలు కూడా పెంచుకుంటూ పోతున్నారు. ప్రైవేటు ఉద్యోగులకు జీతాలు పెరగడం లేదు. కానీ ఖర్చులు మాత్రం విపరీతంగా పెరిగిపోయాయి.

- పీఎంఎల్ నాయుడు, గాజువాక

గోవాడ షుగర్స్‌లో మొలాసిస్ నేలపాలు

- ఊడిపోయిన ట్యాంకు వాల్వ్


మొలాసిస్ ట్యాంకు నుంచి బయటకు పోతున్న మొలాసిస్

చోడవరం, మార్చి 28: మూలిగే నక్కపై తాటిపండు పడిన చందంగా గోవాడ షుగర్ ఫ్యాక్టరీ పరిస్థితి ఉంది. ఒక పక్క ఇంటి దొంగలు ఫ్యాక్టరీలోని విలువైన సామగ్రిని ఎత్తుకుపోతుంటే, మరోవైపు సిబ్బంది నిర్లక్ష్యం వల్ల ఫ్యాక్టరీకి మరింత నష్టం వాటిల్లుతోంది. ఫ్యాక్టరీలో గురువారం ఉదయం మొలాసిస్ లోడింగ్ చేసే వాల్వ్ ఊడిపోవడంతో ట్యాంకు నుంచి ఒక్కసారిగా బయటకు లీక్ అయ్యింది. ట్యాంకు నుంచి బయటకు వచ్చిన మొలాసిస్ దిగువనున్న పిట్ నిండిపోయి చాలా వరకు నేలపాలైంది. తరువాత సిబ్బంది తేరుకుని మొలాసిస్ బయటకు రాకుండా చర్యలు చేపట్టారు. నేలపాలైన మొలాసిస్ సుమారు 5 టన్నులు వరకు ఉంటుందని అంచనా. దీని విలువ రూ.70 వేలు ఉంటుందని భావిస్తున్నారు. ఆస్తి నష్టం పెద్దగా లేకున్నా అసలే ఆర్థిక ఇబ్బందుల్లో కొట్టుమిట్టాడుతున్న గోవాడ ఫ్యాక్టరీలో ఇటువంటి నష్టం కలిగించే పరిణామాలు వరుసగా చోటుచేసుకుంటుండడం విమర్శలకు తావిస్తోంది.

ఎన్నికల్లో ప్రలోభ పెడితే కఠిన చర్యలు

- పోలింగ్ కేంద్రాలు, చెక్ పోస్టులు తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్, ఎస్పీ

నర్సీపట్నం, మార్చి 28: ఎన్నికల్లో ప్రలోభాలకు గురి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి ఆదేశాలు జారీ చేశారు. గురువారం ఎస్పీ మురళీకృష్ణతో కలిసి ఆయన నర్సీపట్నం, గొలుగొండ మండలాల్లోని పోలింగ్ కేంద్రాలు, చెక్ పోస్టులను తనిఖీ చేశారు. నర్సీపట్నం మండలంలోని గబ్బాడ ఎంపీపీ స్కూల్, ఏజెన్సీ లక్ష్మీపురం ఆదర్శ పాఠశాలలోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. మౌలిక సదుపాయాలు, భద్రతా ఏర్పాట్లపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. గొలుగొండ మండలం ఎర్రన్నపాలెం, ఏజెన్సీ లక్ష్మీపురంలోని చెక్ పోస్టులు తనిఖీ చేశారు. వాహనాల తనిఖీలు ముమ్మరం చేయాలని, మద్యం, నాటుసారా, గంజాయి రవాణాను అరికట్టాలని గొలుగొండ ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాన్ని ఆదేశించారు. నగదు, బంగారం, వెండి, ఇతర విలువైన వస్తువులు పంపిణీ చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఎన్‌ఫోర్స్‌మెంట్ కేసులు నమోదు చేయాలన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించిన వారిపై తక్షణమే చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆయన వెంట నర్సీపట్నం రిటర్నింగ్ అధికారి హెచ్‌వీ జయరాం, ఎస్ఐ ఉపేంద్ర ఉన్నారు.


గొలుగొండ మండలంలోని చెక్ పోస్టు వద్ద కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి, ఎస్పీ మురళీకృష్ణ

ఓట్ల నమోదుకు మరో అవకాశం

- వచ్చే నెల 15 వరకు చాన్స్

అనకాపల్లి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి):
అన్ని అర్హతలు ఉండి ఓటు నమోదు చేసుకోనివారికి ఎన్నికల కమిషన్ మరో అవకాశం ఇచ్చింది. ముఖ్యంగా యువతతో పాటు వివిధ కారణాలతో తొలగింపునకు గురైన వారు ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోనేందుకు వచ్చే నెల 15వ తేదీ వరకు గడువు ఇచ్చింది. అర్హులు ఆన్‌లైన్‌తో పాటు ఆఫ్‌లైన్‌లో పోలింగ్ బూత్ లెవిల్ అధికారులు(బీఎల్‌వోలు), తహసీల్దార్లు, ఆర్డీవోలకు దరఖాస్తులు చేసుకొనే అకాశం కల్పించింది. ఇప్పటి వరకు జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 2,769 మంది కొత్తగా ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకున్నారు. నియోజకవర్గాల వారీగా చోడవరం నుంచి 611, మాడుగుల 276, అనకాపల్లి 495, ఎలమంచిలి 428, పాయకరావుపేట 448, నర్సీపట్నం నుంచి 511 దరఖాస్తులు అందగా, వాటిని క్షేత్రస్థాయిలో బీఎల్‌వోలు పరిశీలిస్తున్నారు. ఎప్పటికప్పుడు అందుతున్న దరఖాస్తులను పరిశీలించి ఎన్నికల కమిషన్‌కు పంపుతున్నట్టు జిల్లా రెవెన్యూ అధికారి దయానిధి తెలిపారు. అలాగే గతంలో వివిధ కారణాలతో తొలగించిన ఓటర్ల అర్జీలను పరిశీలిస్తున్నారు.

అధికారులకు చెత్తశుద్ధి ఏది?

పట్టణంలో అపరిష్కృతంగా పారిశుధ్య సమస్య

- తొమ్మిదేళ్ల క్రితం కంపోస్టు యార్డు నిర్మించినా పూర్తిస్థాయిలో వినియోగంలోకి రాని వైనం
- కౌన్సిల్‌లో ప్రతిపక్షాలు నిలదీస్తున్నా పట్టించుకోని పాలకులు, అధికారులు

నర్సీపట్నం, మార్చి 28 :

పారిశుధ్య సమస్య, దుర్గంధం, దోమల బెడదతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పారిశుధ్య విభాగం అధికారి, పాలకవర్గం పట్టించుకోవడం లేదన్న విమర్శలున్నాయి. తొమ్మిదేళ్ల క్రితం నిర్మించిన కంపోస్టు యార్డు పూర్తి స్థాయిలో వినియోగంలోకి రాకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు.


ఇందిరా మార్కెట్‌లో పేరుకుపోయిన చెత్త

వార్డుల్లో ఎక్కడికి వెళ్లినా చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. చెత్త సమస్యను అధికారుల దృష్టికి తీసుకు వెళితే రకరకాల కారణాలు వెతక్కునే ప్రయత్నం చేస్తున్నారు. చెత్తను కంపోస్ట్ యార్డుకి తరలించడానికి రోడ్డు మార్గం లేదని ఇప్పటి వరకు వంకలు చెప్పుకుంటూ వచ్చారు. ఇప్పుడు రోడ్డు అందుబాటులోకి వచ్చింది. అయినా చెత్త సమస్య పరిష్కారం కాలేదు. ఇందిరా మార్కెట్‌ను డంపింగ్ యార్డుగా మార్చేశారు. ఊర్లో చెత్తను తీసుకొచ్చి మార్కెట్ ఆవరణలో పోస్తున్నారు. దాన్ని ఆనుకొనే మాంసం దుకాణాలు నడుపుతున్నారు. పట్టణంలోని చెత్త సమస్య మీద కౌన్సిల్ సమావేశంలో జనసేన, టీడీపీ కౌన్సిలర్లు ప్రతీ నెలా అధికారులను నిలదీస్తున్నా స్పందించడం లేదు.



నిరుపయోగంగా కంపోస్ట్ యార్డు

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో 2016 సంవత్సరంలో బలిఘట్టంలోని వరహానదిని ఆనుకొని రూ.1.5 కోట్లతో సాలిడ్‌వేస్ట్ మేనేజ్‌మెంట్ పార్కు(కంపోస్టు యార్డు) నిర్మాణ పనులకు శ్రీకారం ... మిగతా 6వ పేజీలో

జిల్లాలో పోస్టల్ బ్యాలెట్ ఓటర్లు 28,821 మంది

అనకాపల్లి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి):
వచ్చే సార్వత్రిక ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగులు, సర్వీసు ఓటర్లతో పాటు మరికొన్ని వర్గాలకు పోస్టల్ బ్యాలెట్ సదుపాయం కల్పించనున్నారు. జిల్లాలో పోస్టల్ బ్యాలెట్ ఓటర్లు 28,821 మంది ఉన్నట్టు అధికారులు తేల్చారు. వీరిలో 80 ఏళ్ల దాటిన వృద్ధులు 4,375 మంది, 40 శాతానికి పైబడి వైకల్యం గల దివ్యాంగులు 21,525 మంది, వివిధ సర్వీసుల్లో ఉన్న ఓటర్లు 2,921 మంది ఉన్నారు. పోస్టల్ బ్యాలెట్ వినియోగానికి సంబంధించి ఈ పర్యాయం మార్పులు చేసినట్టు డీఆర్‌వో దయానిధి తెలిపారు. సర్వీసు ఓటర్లు, వృద్ధులు, దివ్యాంగులు తప్ప మిగిలిన వారంతా యంత్రాంగం ఏర్పాటు చేసే ఫెసిలిటేషన్ సెంటర్‌లో పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకోవాల్సి ఉంటుంది. అనకాపల్లిలోని శంకరంలో ఫెసిలిటేషన్ సెంటర్లు ఏర్పాటుచేయనున్నారు. ఎన్నికల కోసం వచ్చే నెల 18న నోటిఫికేషన్ విడుదల ... మిగతా 6వ పేజీలో

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (శుక్ర)	6.13
సహరి (శని)	4.40

క్రైం... crime news

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి

పాయకరావుపేట, మార్చి 28 : తుని రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలోని నర్సీపట్నం-గుల్లిపాడు రైల్వే స్టేషన్ల మధ్య గురువారం గుర్తు తెలియని రైలు నుంచి ప్రమాదవశాత్తూ జారిపడి ఒక వ్యక్తి మృతిచెందాడు. ఇందుకు సంబంధించి తుని ప్రభుత్వ రైల్వే పోలీస్ స్టేషన్ ఎస్ఐ షేక్ అబ్దుల్ మారూఫ్ అందజేసిన వివరాలిలా ఉన్నాయి. నర్సీపట్నం-గుల్లిపాడు రైల్వే స్టేషన్ల మధ్యలో గురువారం మధ్యాహ్నం విశాఖ నుంచి విజయవాడ వైపు వెళుతున్న గుర్తు తెలియని రైలు నుంచి ~45 సంవత్సరాల వయస్సు ఉన్న గుర్తు తెలియని వ్యక్తి ప్రమాదవశాత్తూ జారిపడి అక్కడికక్కడే మృతి చెందాడన్నారు. మృతుడి వంటిపై తెలుపు రంగు ఫుల్ షర్టు, ఫుల్ ప్యాంట్ ఉన్నాయని, మృతుడి వివరాలు తెలియరాలేదన్నారు. మృతదేహాన్ని తుని ఏరియా ఆసుపత్రిలోని మార్చురీలో భద్రపరిచామన్నారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. మృతుడి వివరాలు తెలిసినవారు తుని ప్రభుత్వ రైల్వే పోలీస్ స్టేషన్‌లో లేదా సెల్ నంబర్లు94948 87786, 94906 19020లో సంప్రదించాలని తెలిపారు.

పోలీసుల అదుపులో పోక్సో కేసు నిందితుడు

నర్సీపట్నం, మార్చి 28 : మండలంలోని దుగ్గాడలో బాలికపై అత్యాచార యత్నానికి పాల్పడిన నిందితుడ్ని గురువారం రూరల్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇందుకు సంబంధించి ఎస్ఐ భీమరాజు తెలిపిన వివరాలివి. దుగ్గాడ గ్రామానికి చెందిన పదిహేడేళ్ల బాలిక బుధవారం ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయంలో నాతవరం మండలం గునిపూడికి చెందిన సాయి అత్యాచార యత్నానికి పాల్పడినట్టు ఫిర్యాదు అందిందన్నారు. ఈ మేరకు నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్టు చెప్పారు.

విద్యార్థినిని వేధించిన యువకుడిపై కేసు

నర్సీపట్నం, మార్చి 28 : ఇంజనీరింగ్ విద్యార్థినిని వేధించిన యువకుడిపై పట్టణ పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. నర్సీపట్నం కాపు వీధికి చెందిన విద్యార్థిని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంజనీరింగ్ చదువుతుంది. గురువారం నర్సీపట్నంలోని ఓ పూల దుకాణంలో పని చేస్తున్న అయ్యప్ప అనే యువకుడు వెంట పడి వేధించాడని విద్యార్థిని ఫిర్యాదు చేసిన నేపథ్యంలో నిందితుడిపై కేసు నమోదు చేసినట్టు పట్టణ సీఐ కాంతి కుమార్ తెలిపారు.

146 ఒడిశా మద్యం బాటిళ్లు పట్టివేత

▸ ఇద్దరి అరెస్టు.. బొలేరో వాహనం సీజ్

పరవాడ, మార్చి 28: ఒడిశా రాష్ట్రానికి చెందిన 146 మద్యం బాటిళ్లను పట్టుకొని ఇద్దరు వ్యక్తులను గురువారం అరెస్టు చేసి నట్టు పరవాడ సీఐ బాల సూర్యారావు తెలిపారు. అలాగే మద్యాన్ని తరలించిన బొలేరో వాహనం సీజ్ చేసినట్టు ఆయన చెప్పారు. సీఐ అందించిన వివరా లిలా ఉన్నాయి. పెందుర్తి ప్రాంతానికి చెందిన లాది సుశాంత్‌పాత్రో, విజయనగరం జిల్లా కొత్తవలస గ్రామానికి చెందిన లంక గౌరీశంకర్ కలిసి ఒడిశాలోని బరంపురం నుంచి మద్యం కొనుగోలు చేసి తానాం గ్రామంలో విక్రయిస్తున్నారు. స్థానికులు ఇచ్చిన సమాచారంతో సీఐ బాల సూర్యారావు తన సిబ్బందితో తానాం శివారులో గురువారం మాటువేశారు. ఆ సమయంలో వస్తున్న బొలేరో వాహనాన్ని తనిఖీ చేయగా.. 146 ఒడిశా మద్యం బాటిళ్లు దొరికాయి. ఈ సందర్భంగా అక్రమంగా మద్యం తరలిస్తున్న సుశాంత్‌పాత్రో, గౌరీ శంకర్‌లను అరెస్టు చేశారు. అలాగే మద్యం తరలించేందుకు ఉపయోగించిన బొలేరో వాహనాన్ని సీజ్ చేసినట్టు సీఐ వెల్లడించారు.

12 మద్యం బాటిళ్లు స్వాధీనం

అనకాపల్లి టౌన్, మార్చి 28: పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలోని తుమ్మపాల వద్ద మునగపాక మండలం రాజుపేటకు చెందిన భరణికాన ఆదినారాయణ నుంచి 12 మద్యం క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్టు పట్టణ హెడ్‌కానిస్టేబుల్ బి.రామకృష్ణ గురువారం తెలిపారు. తుమ్మపాలలోని మద్యం దుకాణం నుంచి బాటిళ్లను కొనుగోలు చేసి తీసుకువెళ తుండగా తుమ్మపాల -వెంకుపాలెం రోడ్డులోని షుగర్ ఫ్యాక్టరీ గేటు వద్ద పట్టుకున్నామన్నారు.

హైవేపై కారు బోల్తా.. తప్పిన ప్రమాదం



సంఘటనా స్థలంలో బోల్తాపడిన కారు

కొత్తూరు, మార్చి 28: మండలంలోని పిసినికాడ సమీపంలో జాతీయ రహదారిపై బుధవారం అర్ధరాత్రి కారు రోడ్డు డివైడర్ ఢీకొని బోల్తా పడింది. కాకినాడలో ఒక వివాహానికి వెళ్లి తిరిగి వస్తుండగా ప్రమాదవశాత్తు రోడ్డు డివైడర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న దువ్వాడకు చెందిన ఇద్దరు వ్యక్తులు, ఒక మహిళకు ఎటువంటి గాయాలు తగలలేదు. ఈ విషయమై అనకాపల్లి రూరల్ ఎస్ఐ తేజేశ్వరరావును సంప్రదించగా ఎటువంటి ఫిర్యాదు అందలేదని చెప్పారు.

సారా స్థావరంపై పోలీసుల దాడి

▸ 80 లీటర్ల సారా స్వాధీనం

▸ వెయ్యి లీటర్ల బెల్లం పులుసు ధ్వంసం

పాయకరావుపేట రూరల్, మార్చి 28: మండలంలోని గుంటపల్లి గ్రామ శివారులో గురువారం సారా తయారీ కేంద్రంపై పోలీసులు దాడి చేసి 80 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా అదే గ్రామానికి చెందిన గుత్తుర్తి సూర్యారావును అదుపులోకి తీసుకున్నట్టు సీఐ పి. అప్పలరాజు తెలిపారు. అలాగే వెయ్యి లీటర్ల బెల్లం పులుసు ధ్వంసం చేసినట్టు చెప్పారు. ముందుగా అందిన సమాచారం మేరకు తాను, ఎస్ఐ జోగారావు, పోలీసు సిబ్బందితో కలిసి వెళ్లి దాడి చేశామన్నారు. గుంటపల్లి గ్రామానికి చెందిన గుత్తుర్తి సూర్యారావు, మరొక వ్యక్తి తమను చూసి పారిపోగా.. పోలీసులు వెంబడించి సూర్యారావును పట్టుకున్నామన్నారు. అతని వద్ద నుంచి 80 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నామన్నారు. గుత్తుర్తి సూర్యారావు, పరారీలో ఉన్న పెంకే వీరబాబులపై కేసు నమోదు చేశామని సీఐ అప్పలరాజు తెలిపారు.

అచ్చెన్నాయుడు, సీఎం రమేశ్‌లకు స్వాగతం



అచ్చెన్నాయుడుకు పుష్పగుచ్ఛం అంజేస్తున్న విష్ణుకుమార్‌రాజు, చిత్రంలో సీఎం రమేశ్, తదితరులు ఉన్నారు

గోపాలపట్నం, మార్చి 28: నగరానికి విచ్చేసిన తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు, అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్‌లకు విమానాశ్రయంలో నాయకులు స్వాగతం పలికారు. గురువారం సాయంత్రం ఆరు గంటలకు హైదరాబాద్ నుంచి విశాఖ చేరుకున్న వారికి బీజేపీ 'ఉత్తర' ఎమ్మెల్యే అభ్యర్థి విష్ణుకుమార్‌రాజు, ఆ పార్టీ ప్రోటోకాల్ కన్వీనర్ బాలరాజేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్, నాయకులు నాగేంద్ర, దామోదర్, రామ్‌కుమార్, తదితరులు స్వాగతించారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	107.00
లైవ్ ధర	127.00
విత్ స్కిన్	224.00
స్కిన్ లెస్	234.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	415
విజయనగరం	419
శ్రీకాకుళం	419

ఊరికి దూరంగా పట్టా... నిర్మాణాలు ఎట్టా..?

▸ వజ్రగడలో జగనన్న ఇళ్ల కాలనీ లబ్ధిదారుల ఆవేదన ▸ రెండేళ్లు గడుస్తున్నా ఒక్క పునాదీ పడని వైనం

మాకవరపాలెం, మార్చి 28: మండలంలోని వజ్రగడ గ్రామం లో రెండేళ్ల కిందట గ్రామానికి రెండు కిలోమీటర్ల దూరంలో కొండ ప్రాంతంలో జగనన్న కాలనీకి స్థలం కేటాయించడంతో ఇప్పటి వరకు ఒక్క పునాదులు కూడా వేయలేదు. సుమారు 50 మందికి ఇంటి స్థలాలు మంజూరు చేసి వారికి జగనన్న ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. అయితే గ్రామానికి దూరంగా ఉండడం, కనీస సదుపాయాలు లేకపోవడంతో లబ్ధిదారులు నిర్మాణాలు చేపట్టలేదు. దీంతో ఆ స్థలంలో తుప్పలు దర్శనమిస్తున్నాయి. ప్రజాప్రతినిధులు, అధికారులు కొండ ప్రాంతంలో స్థలాలు ఇచ్చి చేతులు దులిపేసుకున్నారని లబ్ధిదా రులు వాపోతున్నారు. ఈ స్థలాల వద్దకు వెళ్లడానికి సరైన రహదారి కూడా లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



వజ్రగడ గ్రామంలో జగనన్న కాలనీ లబ్ధిదారులకు ఇచ్చిన స్థలం

డిజిటల్ అసిస్టెంట్ స్థానంలో గ్రామ వలంటీర్

▸ పి.కె.గూడెం సచివాలయంలో విధులు

▸ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నా పట్టించుకోని అధికారులు

▸ అభ్యంతరం తెలుపుతున్న గ్రామస్థులు

నాతవరం, మార్చి 28: ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమలులో ఉంటుండగా, మండలంలోని పి.కె.గూడెం గ్రామ సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్ స్థానంలో గ్రామ వలంటీర్ గొంప సతీష్ విధులు నిర్వహించడంపై ఆ గ్రామస్థులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. మూడేళ్ల నుంచి ఈ గ్రామ సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్ పోస్టు ఖాళీగా ఉండడంతో ఇప్పటివరకు వలంటీర్ సతీష్ ఆ విధులు నిర్వహించినా తాము పట్టించుకోలేదన్నారు. అయితే ఎన్నికల కోడ్ అమలులో ఉన్న సమయంలోనూ డిజిటల్ అసిస్టెంట్ స్థానంలో విధులు నిర్వహిస్తుండడం తగదని, దీనిపై నర్సీపట్నం ఆర్డీవోకు ఫిర్యాదు చేస్తామని గ్రామానికి చెందిన గాడి పెంటయ్యనాయుడు గురువారం తెలిపారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌ను వివరణ కోరగా, తాను ఇక్కడకు రాకముందు నుంచి డిజిటల్ అసిస్టెంట్‌స్థానంలో వలంటీర్ విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. ప్రస్తుతం సచివాలయంలో విధులు నిర్వహించవద్దని వలంటీర్‌కు చెప్పానన్నారు.



డిజిటల్ అసిస్టెంట్ స్థానంలో విధులు నిర్వహిస్తున్న వలంటీర్ సతీష్

జగన్ పాలనలో మత్స్యకారులకు అన్యాయం

▸ ఓటుతో సర్కారును సాగనంపుదాం

▸ పూరీలో వలస మత్స్యకారుల సమావేశంలో టీడీపీ పాయకరావుపేట అభ్యర్థి వంగలపూడి అనిత



పూరీలో పేట మత్స్యకారుల సమావేశంలో మాట్లాడుతున్న అనిత

నక్కపల్లి, మార్చి 28: జగన్ రెడ్డి పాలనలో మత్స్యకారులకు ఐదేళ్లుగా తీరని అన్యాయం జరిగిందని టీడీపీ పాయకరావుపేట ఎమ్మెల్యే అభ్యర్థి వంగలపూడి అనిత అన్నారు. పూరీ, కోణార్క్‌ల్లో వుంటున్న నియోజకవర్గ మత్స్యకార వలస ఓటర్లను కలిసేందుకు ఆమె పూరీ వెళ్లారు. గురువారం ఉదయం పూరీలో ఇంటింటా ప్రచారం చేసి సూపర్ సిక్స్ పథకాల గురించి వివరించారు. అనంతరం అక్కడున్న మత్స్యకార నాయకులు, గంగపుత్రులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. పాయకరావుపేట నియోజకవర్గంలో ఫిష్ ల్యాండింగ్ సెంటర్లు, జెట్టీ నిర్మాణాలు కూడా వైసీపీ ప్రభుత్వం చేయలేకపోయిందన్నారు. ఐదేళ్ల జగన్ పాలనలో రాష్ట్రం అధోగతి పాలైందని, ఇటువంటి రాక్షస పాలనను అంతమొందించేందుకు ఓటు అనే ఆయుధాన్ని సద్వినియోగపర్చుకోవాలని సూచించారు. సామాన్యుడి చేతిలో శక్తి వంతమైన ఓటుతో జగన్ సర్కారును అందరం కలిసి కట్టుగా సాగనంపాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. మత్స్యకారులు టీడీపీ ఆవిర్భావం నుంచి అండదండగా వుంటున్నారని, నియోజకవర్గంలో మత్స్యకారుల సంక్షేమానికి తాను చిత్తశుద్ధితో పనిచేస్తానని హామీ ఇచ్చారు. పాయకరావుపేట నుంచి పూరీ వచ్చానని, మీ ఇంటి ఆడబిడ్డగా తనను ఆశీర్వదించాలని అనిత కోరారు. ఈ సందర్భంగా పూరీలో వున్న పేట వలస మత్స్యకారులు ఆమెకు ఘనస్వాగతం పలికారు. అనంతరం పలువురు మత్స్యకార నాయకులతో అనిత, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు కూడా సమావేశమయ్యారు.



పూరీలో మత్స్యకార సంఘ నాయకులలో మాట్లాడుతున్న అనిత

ముగిసిన వెంకన్న కల్యాణోత్సవాలు

▸ మరో పది రోజుల పాటు తీర్థం

▸ రికార్డు స్థాయిలో తరలివస్తున్న భక్తులు



ఉభయ దేవేరులతో కూడిన కల్యాణ వేంకటేశ్వరుడు

నక్కపల్లి, మార్చి 28 : జిల్లాలో ప్రాచీన పుణ్యక్షేత్రమైన ఉపమాకలో శ్రీవారి వార్షిక కల్యాణోత్సవాలు గురువారం రాత్రి పుష్పయాగోత్సవాలతో ఘనంగా ముగిశాయి. ఈనెల 19 నుంచి స్వామివారి వార్షిక కల్యాణోత్సవాలు పాంచరాత్ర ఆగమ శాస్త్రం ప్రకారం ప్రారంభమయ్యాయి. అంకురార్పణ, ధ్వజారోహణ, ఎదురు సన్నాహోత్సవం, రథోత్సవాలు, కల్యాణోత్సవం, తోట ఉత్సవం, చక్రస్నానం, పూర్ణాహుతి సహా అనేక తిరువీధి సేవలు ఎంతో ఘనంగా జరిగాయి. ఈనెల 20న కల్యాణోత్సవం సందర్భంగా స్వర్ణాలంకరణలో స్వామివారు భక్తులకు అపురూప దర్శనమిచ్చారు. రికార్డు స్థాయిలో పలు ప్రాంతాల నుంచి భక్తులు ఉపమాక ఆలయానికి వస్తున్నారు. గురువారం రాత్రి పుష్పయాగోత్సవం మూడో రోజు స్వామివారికి ఆలయ అర్చకుల బృందం ప్రత్యేక పూజలు నిర్వహించింది. భక్తుల తాకిడికి తగ్గట్టు టీటీడీ ఏర్పాట్లు చేయలేదనే విమర్శలు మాత్రం వినిపించాయి. స్వామివారి కల్యాణోత్సవాలు సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్పీ మురళీకృష్ణ ఆదేశాల మేరకు సీఐలు విజయ్‌కుమార్,అప్పన్న పటిష్ట చర్యలు చేపట్టారు. కాగా ఉపమాక వెంకన్న జాతరలో భాగంగా తీర్థం మరో 10 రోజులు జరగనుంది.



కాంతులీనుతున్న ఉపమాక క్షేత్రం

ఐపీఎల్ టికెట్లపై లోపించిన పారదర్శకత

▸ చెన్నై సూపర్‌కింగ్స్, ఢిల్లీ క్యాపిటల్స్ మ్యాచ్ టికెట్లు బ్లాక్ చేశారనే ఆరోపణలు

▸ ఆన్‌లైన్‌లో ఎన్ని టికెట్లు అమ్మకానికి ఉంచారో వెల్లడించని నిర్వాహకులు

▸ మరోవైపు టికెట్లు, కాంప్లిమెంటరీ పాస్‌ల కోసం ▸ ప్రభుత్వ అధికారులు, రాజకీయ ప్రముఖుల ఒత్తిడి

విశాఖపట్నం (స్పోర్ట్సు), మార్చి 28:

చెన్నై సూపర్‌కింగ్స్, ఢిల్లీ క్యాపిటల్స్ జట్ల మధ్య ఈనెల 31న నగరంలోని ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో జరిగే ఐపీఎల్ మ్యాచ్ టికెట్ల విక్రయాల్లో పారదర్శకత లోపించిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. బుధవారం ఉదయం పది గంటలకు ఆన్‌లైన్‌లో పేటీఎం ఇన్‌సైడర్ ద్వారా టికెట్ల అమ్మకం ప్రారంభించారు. కేవలం పావుగంటలోనే రూ.1,000, రూ.1,500 విలువ గల టికెట్లు, మరో గంటన్నరకు రూ.3,000, రూ.4,000 టికెట్లు సోల్డ్ అవుట్ అని ప్రకటించడం విస్మయానికి గురిచేసింది. రూ.2,000, రూ.3,500 ధర గల టికెట్ల విషయంలో స్పష్టత లేదు. మ్యాచ్‌కు తీవ్ర డిమాండ్ రావడంతో టికెట్లను బ్లాక్ చేశారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఎన్ని టికెట్లు అమ్మకానికి పెట్టారు?

స్టేడియం సీటింగ్ సామర్థ్యం 25 వేలు. చెన్నై సూపర్‌కింగ్స్, ఢిల్లీ క్యాపిటల్స్ మ్యాచ్‌కు బుధవారం ఆన్‌లైన్‌లో ఎన్ని టికెట్లు అందుబాటులో పెట్టారనే వివరాలు నిర్వాహకులు వెల్లడించలేదు.

బుధవారం మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో సోల్డ్ అవుట్‌గా ప్రకటించిన వాటిలో రూ.1,000, రూ.1,500, రూ.3,000, రూ.4,000 ధర టికెట్ల వివరాలున్నాయే తప్ప...రూ.2,000, రూ.3,500 టికెట్ల ప్రస్తావన లేదు. దీంతో ఆ ధరల టికెట్లు ఏమయ్యాయని ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

నామమాత్రపు పాత్రగా ఏసీఏ

ఐపీఎల్ మ్యాచ్‌ల నిర్వహణలో ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ నామమాత్రపు పాత్ర పోషిస్తున్న నేపథ్యంలో ఏసీఏ-వీడీసీఏ స్టేడియాన్ని హోంగ్రౌండ్‌గా చేసుకున్న ఢిల్లీ క్యాపిటల్స్ యాజమాన్యం తమ ఇష్టానుసారంగా వ్యవహరిస్తోందని విమర్శలు వినిపిస్తున్నాయి. ఢిల్లీ క్యాపిటల్స్ యాజమాన్యానికి అవసరమైన సదుపాయాలను ఏర్పాటుచేయడమే తమ బాధ్యతని, టికెట్ల అమ్మకాలలో తమ ప్రమేయం ఏమీ లేదని ఏసీఏ చెబుతోంది. కాగా క్లబ్ క్రికెటర్లు, అంపైర్లతోపాటు ఏసీఏ, వీడీసీఏ కార్యకలాపాలలో పాలుపంచుకునే వారికి కూడా ఐపీఎల్ మ్యాచ్‌లకు టికెట్లు/కాంప్లిమెంటరీలు ఇవ్వలేమని మెయిల్, ఇతర సమాచార వ్యవస్థల ద్వారా ఏసీఏ ఇప్పటికే స్పష్టం చేసిందని క్రికెట్ వర్గాలు చెబుతున్నాయి. ఇదిలావుంటే మ్యాచ్‌ల నిర్వహణకు సంబంధించి ప్రధాన నిర్వాహకులైన ఢిల్లీ క్యాపిటల్స్ యాజమాన్యం ఇప్పటివరకూ అధికారంగా ఎటువంటి ప్రకటనలు చేయకపోవడం గమనించదగ్గ విషయం.

ధోనీ ఆడనుండడంతో చెన్నై సూపర్‌కింగ్స్, ఢిల్లీ క్యాపిటల్స్ మ్యాచ్‌కు మంచి క్రేజ్ వచ్చింది. దీంతో టికెట్ల కోసం ప్రభుత్వ అధికారులు, రాజకీయ ప్రముఖుల నుంచి ఒత్తిడి ఎక్కువ కావడంతో తక్కువ సంఖ్యలో టికెట్లను అమ్మకానికి పెట్టి, మిగిలిన వాటిని బ్లాక్ చేశారని వినికిడి. దీంతో సగటు సామాన్య క్రీడాభిమానికి టికెట్ లభించే పరిస్థితి లేకుండా పోయింది.

లోక్‌సభ అభ్యర్థి సీఎం రమేశ్ సభకు తరలిరండి

▸ జిల్లా టీడీపీ అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు



సమావేశంలో మాట్లాడుతున్న బుద్ద, చిత్రంలో పరమేశ్వరరావు, పంచకర్ల రమేష్‌బాబు

అనకాపల్లి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): బీజేపీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్ ఆధ్వర్యంలో పట్టణంలోని జేఎంజీ స్కూల్ ఎదురుగా మైదానంలో శుక్రవారం ఉదయం 11 గంటలకు జరగనున్న బహిరంగ సభకు జిల్లా నలుమూలల నుంచి అశేషంగా జనం తరలిరావాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు పిలుపునిచ్చారు. గురువారం ఆయన జిల్లా టీడీపీ కార్యాలయంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పరమేశ్వరరావు, జనసేన జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్‌బాబులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల కూటమి అభ్యర్థులు, నియోజకవర్గ ఇన్‌చార్జిలు, పార్టీ నాయకులు తరలివచ్చి కూటమి ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్‌కు సభను జయప్రదం చేయాలని కోరారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు మాట్లాడుతూ బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్ తొలిసారిగా అనకాపల్లి వస్తున్నందున ఘన స్వాగతం పలకాలన్నారు. అనకాపల్లి చేరుకొని నూకాంబిక, గౌరీపరమేశ్వరి అమ్మవార్లను దర్శించుకుంటారని తెలిపారు. అనంతరం క్యాంపు కార్యాలయానికి చేరుకొన్న తర్వాత జేఎన్‌జీ స్కూల్ ఎదురుగా ఏర్పాటు చేసిన సభా వేదిక వద్దకు చేరుకుంటారని తెలిపారు. జనసేన జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్‌బాబు మాట్లాడుతూ కూటమి అభ్యర్థి సీఎం రమేశ్ సభకు జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, వీరమహిళలు తరలి వచ్చి విజయవంతం చేయాలని కోరారు.

వెలుగు సీసీపై ఎన్నికల అధికారికి ఫిర్యాదు

▸ వైసీపీ వర్గీయులతో కలిసి మా ఇంటిపై రాళ్లదాడి

▸ ఎర్రవరం టీడీపీ నాయకుడు ఆరోపణ

▸ కుటుంబానికి రక్షణ కల్పించాలని వేడుకోలు

గొలుగొండ, మార్చి 28 : ఇక్కడి వెలుగు ప్రాజెక్టు పరిధిలోని చోద్యం క్లస్టర్‌లో కమ్యూనిటీ కో-ఆర్డినేటర్ (సీసీ)గా పనిచేస్తున్న సర్వసిద్ధి శ్రీరామ్మూర్తిపై చర్యలు చేపట్టాలని డివిజనల్ ఎన్ని కల అధికారి, నర్సీపట్నం ఆర్డీవో జయరాంకు టీడీపీ నాయకుడు అమరపల్లి నాగేశ్వరరావు గురువారం ఫిర్యాదు చేశారు. మండలం లోని ఎర్రవరం పంచాయతీకి చెందిన సీసీ శ్రీరామ్మూర్తితో పాటు వైసీపీ నాయకులు, కార్యకర్తలు ఎర్రవరంలోని తమ ఇంటిపై బుధవారం రాళ్లతో దాడిచేశారని ఆరోపించారు. వీరి నుంచి తమ కుటుంబానికి రక్షణ కల్పించాల్సిందిగా ఆయన కోరారు. వైసీపీకి చెందిన కొంతమందిని వెలుగు సీసీ గ్రామంలో వెనకేసుకుని వివాదాలు సృష్టిస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం మునిసిపల్ కౌన్సిలర్ ధనిమిరెడ్డి మధు పాల్గొన్నారు.

తాడిని తరలించకుంటే ఎన్నికల బహిష్కరణ

▸ ఆర్డీవో కార్యాలయ డీటీకి గ్రామస్థుల వినతి



ఆర్డీవో కార్యాలయ డీటీకి వినతిపత్రం ఇస్తున్న తాడి గ్రామస్థులు

అనకాపల్లి టౌన్, మార్చి 28 : కాలుష్య కోరల్లో చిక్కుకున్న తాడి గ్రామాన్ని తరలించకపోతే సాధారణ ఎన్నికలను బహిష్కరిస్తామని ఆ గ్రామానికి చెందిన పెద్దలు గురువారం ఆర్డీవో కార్యాలయ డీటీ జయశ్రీని కలిసి వినతిపత్రం అందజేశారు. పరవాడ మండలం తాడిలో కాలుష్యం పెరగడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. అందువలన గ్రామాన్ని తరలించాలని కోరారు. గ్రామానికి ఆనుకుని గ్రీన్‌బెల్ట్ నిబంధనలు ఉల్లంఘించి పైపులైన్ పనులు చేస్తున్నారని, వెంటనే ఆ పనులను నిలుపుదల చేయించాలని, గ్రామాన్ని తరలించే వరకు ఎన్నికల బహిష్కరణ చేయాలని నిర్ణయించామని గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నేత మాదంశెట్టి నీలబాబు, మాజీ సర్పంచ్ బి.అప్పారావు, రామరాజు, నూకరాజు తదితరులు వివరించారు. ఈ విషయాన్ని గ్రామప్రజలంతా ఏకగ్రీవంగా తీర్మానించి మీ దృష్టికి తీసుకురావడమైందని వివరించారు. సమస్యను తక్షణమే పరిష్కరించేందుకు తగు చర్యలు తీసుకోవాలని కోరారు

కోనాం సంతలో చింతపండుకు భలే గిరాకీ

▸ కిలో రూ.55 నుంచి రూ.60 చెల్లించి వ్యాపారులు కొనుగోలు



సంతకు విక్రయానికి తెచ్చిన చింతపండు

చీడికాడ, మార్చి 28 : మండలంలోని కోనాం సం తలో చింతపండుకు గురువారం మంచి గిరాకీ ఏర్ప డింది. బొట్టలు పెద్దవిగా ఉండడంతో వ్యాపారులు పోటీపడి కిలోకు రూ.అరవై వరకు చెల్లించి కొనుగోలు చేశారు. కోనాం పంచాయ తీతో పాటు పాడేరు, మాడుగుల, హుకుంపేట, అనంతగిరి మండలాలకు చెందిన గిరిజన గ్రామాల నుంచి ఉదయం ఆరు గంటలతో చింతపండుకు తీసుకుని రైతుల రాక ఆరంభమైంది. అసలే వేసవికాలం ఆరం భం కావడంతో ఎండలు మండుతున్న తరుణంలో మైదాన ప్రాంత వ్యాపారులు సైతం అదే సమయానికి సంతకు చేరుకున్నారు. ఇలా వచ్చిన చింతపండును పోటీపోటీగా కొనుగోలు చేశారు. గత వారం కిలో రూ.50నుంచి రూ.55 పలికిన చింత పండు, ఈ వారం రూ.55 నుంచి రూ.60 వరకు పలకడం విశేషం. అయినప్పటికీ ఎవరూ వెనక్కి తగ్గలేదు. సంతకు భారీస్థాయిలో చింతపండు వచ్చినప్పటికీ ఉదయం పదిగంటలకే అమ్మడుకు కావడంతో గిరి రైతులు ఆనందం వ్యక్తం చేశారు.

నూకాంబిక జాతర పోస్టర్ ఆవిష్కరణ



భక్తుల సమక్షంలో పోస్టర్ ఆవిష్కరించిన అధికారులు

అనకాపల్లి టౌన్, మార్చి 28 : స్థానిక నూకాంబిక బాలాలయంలో గురువారం సాయంత్రం అమ్మవారి కొత్త అమావాస్య జాతర వాల్ పోస్టర్, కరపత్రాలను ఈవో బండారు ప్రసాద్ ఆవిష్కరించారు. ఏప్రిల్ ఏడో తేదీ రాత్రి అమ్మవారి జాతర ప్రారంభమవుతుందని, ఎనిమిదవ తేదీన కొత్త అమావాస్య పండగ జరుగుతుందని, తొమ్మిదో తేదీన ఉగాది వేడుకలు జరుగుతాయని ఈవో ప్రసాద్ తెలిపారు. మే ఏడో తేదీన అమ్మవారి నెల పండగ నిర్వహించనున్నామన్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, అర్చకులు , భక్తులు పాల్గొన్నారు.

గురుకుల ఎలక్ట్రీషియన్‌కు ఘన సన్మానం

నక్కపల్లి, మార్చి 28: స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకులాల ఎలక్ట్రీషియన్ మొల్లేటి నూకరాజు దంపతులను గురువారం ఘనంగా సత్కరించారు. ఈనెల 31న నూకరాజు పదవీవిరమణ చేయనున్న నేపథ్యంలో గురువారమే గురుకులంలో ఆయన్ని అంబేడ్కర్ గురుకులాల జిల్లా కో-ఆర్డినేటర్ రూపవతి, స్థానిక ప్రిన్సిపాల్ సువర్ణకుమారి సన్మానించారు. కార్యక్రమంలో రిటైర్డ్ ప్రిన్సిపాల్ రాజేశ్, తాళ్లపాలెం ప్రిన్సిపాల్ గ్రేస్, విజయలక్ష్మి సత్కరించారు.

సూపర్ సిక్స్ పథకాలపై ఉమ్మడి ప్రచారం



8వ వార్డులో ప్రచారం చేస్తున్న టీడీపీ నాయకులు

పాయకరావుపేట, మార్చి 28 : రాష్ట్రంలో టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి వస్తే అమలు చేయబోయే సూపర్ సిక్స్ పథకాలపై ఆ పార్టీల నాయకులు గురువారం పట్టణంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు పెదిరెడ్డి శ్రీను ఆధ్వర్యంలో పట్టణంలోని 8, 9వ వార్డుల్లోని కృష్ణవీధి, శెట్టిబలిజ వీధి తదితర ప్రాంతాల్లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు, జనసేన పార్టీ పట్టణ అధ్యక్షుడు ఆచంట దొర తదితరులు కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు చింతకాయల రాంబాబు, పల్లా విలియంకేరి, సూరా సుబ్రహ్మణ్యం, ఎం.రమాకుమారి, లెక్కల గోవిందు, మలిపెద్ది వెంకటరమణ, జనసేన నాయకుడు శివలంక నాగమల్లి, బీజేపీ నాయకుడు కువల కుమార్ పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరంలో 35 మందికి పరీక్షలు

ఎస్. రాయవరం, మార్చి 28: మండలంలోని తిమ్మాపురం సచివాలయం వద్ద విశాఖ ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి వైద్యులు గురువారం నిర్వహించిన ఉచిత నేత్ర శిబిరంలో 35 మంది రోగులకు పరీక్షలు నిర్వహించారు. వీరిలో ఆరుగురికి ఆపరేషన్లు అవసరమవుతాయని వైద్యులు నిర్ధారించారు. అవసరమైన వారికి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి రామిరెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా పైడిమాంబ విగ్రహ ప్రతిష్ఠ



భక్తుల పూజలందుకుంటున్న పైడిమాంబ అమ్మవారు.

రాంబిల్లి, మార్చి 28: మండలంలోని మామిడివాడ పైడిమాంబ ఆలయంలో గురువారం అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. వేకువజాము నుంచి వేదపండితులు ప్రత్యేక హోమాలు, పూజలు నిర్వహించారు. శుభముహూర్తాన ఆలయాన్ని ప్రారంభించి, అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఎలమంచిలి, చోడవరం ఎమ్మెల్యేలు యూవీ.రమణమూర్తిరాజు, కరణం ధర్మశ్రీ, డీసీసీబీ మాజీ చైర్మన్ యు.సుకుమారవర్మ, టీడీపీ ఎలమంచిలి నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు, టీడీపీ మండల అధ్యక్షుడు వి.దినే‌బాబు, మాజీ సర్పంచ్ నెట్టెం సత్యనారాయణ అమ్మవారిని దర్శించారు.

ఎలమంచిలి రైల్వే స్టేషన్ సందర్శించిన ఏడీఆర్ఎం

ఎలమంచిలి, మార్చి 28: ఎలమంచిలి రైల్వే స్టేషన్‌ను గురువారం రాత్రి రైల్వే ఏడీఆర్ఎం, పీఈ. ఎడ్విన్ సందర్శించారు. స్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. స్టేషన్‌ను సందర్శించిన ఏడీఆర్ఎంకు స్థానికులతోపాటు పాసింజర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు కలిసి రైల్వే స్టేషన్‌లో పలు ఎక్స్‌ప్రెస్ రైళ్ల హాల్ట్ కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఎలమంచిలి ప్రాంతం పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతుందని, నిత్యం ఇతర ప్రాంతాల ప్రయాణికుల సౌకర్యార్థం పలు రైళ్లకు హాల్ట్ ఇప్పించాలని కోరారు.

అప్రకటిత విద్యుత్ కోతలతో అవస్థలు

పాయకరావుపేట, మార్చి 28 : మండుతున్న ఎండలకు ఉక్కిరిబిక్కిరవుతున్న పట్టణవాసులు రెండ్రోజులుగా అప్రకటిత విద్యుత్ కోతలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పట్టణ విద్యుత్ సబ్ స్టేషన్‌లో హెచ్‌టీ లైన్ల మార్పు కోసం బుధ, గురువారాలు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని విద్యుత్ శాఖ అధికారులు ప్రకటించారు. అయితే బుధ, గురువారాల్లో రాత్రి 8.30 నిమిషాల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. ఆ తరువాత లోఓల్టేజి కారణంగా గంటల తరబడి ఫ్యాన్లు, ఏసీలు సరిగ్గా పనిచేయక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

పచ్చని చెట్లపై గొడ్డలి వేటు

- విద్యుత్ లైన్ల కింద చెట్ల నరికివేత
- కొమ్మలు కొట్టాలేగానీ చెట్లు ఎలా నరికివేస్తారని పర్యావరణ ప్రేమికుల మండిపాటు
- మునిసిపల్, విద్యుత్ శాఖల మధ్య సమన్వయ లోపం



కొత్తపేట రామాలయం వీధిలో కొట్టి పడేసిన చెట్టు

ఎలమంచిలి, మార్చి 28: పర్యావరణాన్ని పరిరక్షణకు దోహదపడుతున్న పచ్చని చెట్లు రెండు అధికారిక శాఖల మధ్య సమన్వయ లోపం కారణంగా గొడ్డలి వేటుకు గురవుతున్నాయి. పట్టణంలో కళ్ల ముందే పెరిగిన పచ్చని చెట్లు గొడ్డలి వేటుకు గురవుతుండడాన్ని పర్యావరణ ప్రేమికులు, పట్టణ ప్రజలు జీర్ణించుకోలేకపోతున్నారు. అధికారుల తీరును విమర్శిస్తున్నారు. మునిసిపాలిటీలో పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఆరేళ్ల క్రితం మునిసిపల్ పాలకులు, అధికారులు కలిసి వీధులు వెంబడి ఏకకాలంలో రెండు వేలకు పైగా మొక్కలను నాటారు. కొన్నిచోట్ల మొక్కలను విద్యుత్ లైన్లు కింద నాటడంతో అవి పెరిగి విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగిస్తున్నాయి. దీంతో విద్యుత్ శాఖ సిబ్బంది ఈ చెట్ల కొమ్మలను నరికివేసేవారు. ఇటీవల కొన్నిచోట్ల విద్యుత్ సిబ్బంది ఏకంగా చెట్లనే నరికివేస్తున్నారు. ఈ విషయమై మునిసిపల్ అధికారులు పట్టించుకోకపోవడం పట్ల పర్యావరణ ప్రేమికులు మండిపడుతున్నారు. విద్యుత్ లైన్ల కింద చెట్లు ఉంటే కొమ్మలు నరికి వేయాలే తప్ప చెట్లను నరికివేయడం ఎంతవరకు సమంజమని పలువురు ప్రశ్నిస్తున్నారు. మునిసిపాలిటీ, విద్యుత్ శాఖల మధ్య సమన్వయం లేకపోవడంతో ఇటువంటి పరిస్థితి ఏర్పడుతుందని వారంటున్నారు. భవిష్యత్తులో ఇటువంటి సమస్య తలెత్తకుండా రెండు శాఖ అధికారులు సమన్వయంతో వ్యవహరించాలని పలువురు పర్యావరణ ప్రేమికులు అభిప్రాయపడుతున్నారు.

మానసిక ఒత్తిడిని అధిగమించేందుకు దివ్యౌషధం యోగా

- జనసేన అనకాపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి కొణతాల రామకృష్ణ



వాకర్స్‌తో సైకిల్ తొక్కుతున్న కొణతాల రామకృష్ణ

కొత్తూరు, మార్చి 28 : సమాజంలో వివిధ వర్గాలు మానసిక ఒత్తిడితో జీవనం సాగిస్తున్నాయని, ఆ ఒత్తిడిని అధిగమించేందుకు యోగ పరిపూర్ణమైన ఔషధమని జనసేన అనకాపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి కొణతాల రామకృష్ణ అన్నారు. గురువారం అనకాపల్లి ఎన్టీఆర్ మార్కెట్ యార్డులో వాకర్స్‌ను ఆయన కలిశారు. అక్కడ వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాకర్స్‌క్లబ్ జిల్లా అధ్యక్షుడు కాండ్రేగుల సత్యనారాయణ మాట్లాడుతూ మార్కెట్ యార్డులో మట్టితో కూడిన వాకర్స్ ట్రాక్‌ను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం డీడీ.నాయుడు మాట్లాడుతూ వాకింగ్ చేయడం వల్ల బీపీ నియంత్రణలో ఉంటుందన్నారు. కాగా ఎటువంటి మందులు వాడకుండా ఆరోగ్యంగా ఉండాలంటే యోగా ఎంతో ముఖ్యమైందని రామకృష్ణ అన్నారు. అధికారంలోకి రాగానే వాకర్స్ సమస్యలన్నింటినీ పరిష్కరిస్తానని చెప్పారు. ఎన్నికల్లో వాకర్స్‌క్లబ్ సభ్యులందరూ గాజుగ్లాసుకు గుర్తు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం సైకిల్ తొక్కుతూ వాకర్స్ అందరినీ ఉత్సాహపరిచారు. తర్వాత కార్యకర్తలతో మార్కెట్ యార్డులో పర్యటించారు. అనంతరం అనకాపల్లి 84వ వార్డులో ఉన్న గొల్లవీధి ప్రాంతానికి చెందిన టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులతో కాఫీ విత్ కేడర్ కార్యక్రమంలో కొణతాల రామకృష్ణ పాల్గొని మాట్లాడారు. అసెంబ్లీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనకు గాజుగ్లాసు గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. బీజేపీ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న సీఎం రమేశ్ గుర్తు కమలంపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. అధికారంలోకి రాగానే పింఛన్లు పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం 12, 13, 14 వార్డుల్లో మూడు పార్టీల శ్రేణులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు, టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మాదంశెట్టి నీలబాబు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు డాక్టర్ నారాయణరావు, వాకర్స్ క్లబ్ ప్రతినిధులు కాండ్రేగుల జగ్గారావు, యల్లపు శివ, యల్లపు సత్యనారాయణ, కాండ్రేగుల గంగరాజు, బీశెట్టి రామకృష్ణ, రాపేటి నారాయణరావు పాల్గొన్నారు.

వైసీపీ నుంచి 50 మంది జనసేనలో చేరిక



జనసేన పార్టీలో చేరిన యువకులతో కొణతాల రామకృష్ణ, పీలా గోవింద

కశింకోట, మార్చి 28 : మండలంలోని నర్సింగబిల్లి, చింతలపాలెం గ్రామాలకు చెందిన 50 మంది యువకులు వైసీపీ నుంచి జనసేన పార్టీలోకి గురువారం చేరారు. ఈ సందర్భంగా వారికి జనసేన అనకాపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి కొణతాల రామకృష్ణ పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. అనంతరం కొణతాల మాట్లాడుతూ ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి రాగానే యువతకు 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద మాట్లాడుతూ.. జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి కొణతాల రామకృష్ణను గాజుగ్లాస్‌పై ఓటు వేసి గెలిపించాలన్నారు. అలాగే బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్‌ను కమలం గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు కాయల మురళీ, మజ్జి నిరంజన్ కుమార్, మజ్జి ప్రకాష్, నిమ్మదల సన్యాసినాయుడు, ఎంపీటీసీ సభ్యుడు షేక్ దర్గా, గొంతిన శ్రీనివాసరావు, వేగి గోపీకృష్ణ, సిదిరెడ్డి శ్రీనివాసరావు, పెంటకోట రాము, సతీష్ తదితరులు పాల్గొన్నారు. అలాగే జనసేన అనకాపల్లి అసెంబ్లీ అభ్యర్థి కొణతాల రామకృష్ణను గెలిపించాలంటూ టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలు జట్టు పురెడ్డితుని, చింతలపాలెం, బయ్యవరం గ్రామాల్లో గురువారం ప్రచారం చేశారు. వైసీపీ ప్రభుత్వంలో నిత్యావసర వస్తువుల ధరలు, ఇంటి పన్ను, చెత్తపన్ను, విద్యుత్ ఛార్జీలు తదితర వాటిని పెంచేశారని వివరించారు. వాటన్నింటి ధరలు తగ్గాలంటే టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం రావాలన్నారు.

జనసేనలో చేరిన వైసీపీ నేతలు

- పార్టీలోకి ఆహ్వానించిన సుందరపు విజయకుమార్



జనసేనలో చేరిన రాజుకోడూరు సర్పంచ్ ఎం.శంకరరావు, జడ్పీటీసీ మాజీ సభ్యులు బొద్దపుదాసు, పలువురు వైసీపీ శ్రేణులు

రాంబిల్లి, మార్చి 28 : ఎలమంచిలి నియోజకవర్గంలోని రాంబిల్లి, అచ్యుతాపురం, మునగపాక మండలాలకు చెందిన పలువురు వైసీపీ ప్రజాప్రతినిధులు, వారి అనుచరులు 200 మంది గురువారం జనసేన పార్టీలో చేరారు. మండలంలోని హరిపురంలో పార్టీ కార్యాలయంలో జనసేన ఎలమంచిలి అభ్యర్థి సుందరపు విజయకుమార్ సమక్షంలో వైసీపీకి చెందిన రాజుకోడూరు సర్పంచ్ ముత్తా శంకరరావు, వైస్ సర్పంచ్ కె.మాణిక్యంబాబు, నలుగురు వార్డు సభ్యులు, జడ్పీటీసీ మాజీ సభ్యుడు బొద్దపు దాసు, వారి అనుచరులు జనసేనలో చేరారు. అలాగే అచ్యుతాపురం మండలంలో వైసీపీకి చెందిన డొప్పెర్ల సచివాలయం కన్వీనర్ బి.శ్రీనివాసరావు (బాల), వార్డు సభ్యులు కె.అప్పలనాయుడు, కె.దేముడు, పంచాయతీ నేత కె.రాములు వారి అనుచరులు, మునగపాక మండలంలో వైసీపీకి చెందిన మడగపాలెం వైస్ సర్పంచ్ ఉల్లింగల చిరంజీవి, వార్డు సభ్యులు బాజుల సూరిబాబు, ఉల్లింగల జగదీష్ వారి అనుచరులు జనసేన పార్టీలో చేరారు. అలాగే అచ్యుతాపురం మండల దుప్పితూరుకు చెందిన వైసీపీ ఎలమంచిలి నియోజకవర్గ కాపు సంక్షేమ సంఘం అధ్యక్షులు ప్రగడ చిననాగేశ్వరరావు సుందరపు సమక్షంలో వైసీపీలో చేరారు. వీరందరికీ సుందరపు కండువా వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా విజయకుమార్ మాట్లాడుతూ వైసీపీ పాలనపై విసుగు చెందిన ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో జనసేన పార్టీలోకి వస్తుండడం శుభపరిణామమన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు జనపరెడ్డి శ్రీనివాసరావు, బైలపూడి శ్రీరామదాసు, పప్పల నూకన్నదొర, టెక్కలి పరశురామ్, బి.శ్రీనివాసరావు, అన్నం బాబ్జి, చొప్పా శ్రీను, లాలం చందు, పైల రామునాయుడు, ద్వారపురెడ్డి బాబ్జి, జి.సూరిఅప్పారావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అనిత గెలుపు కోసం కలిసి పనిచేద్దాం

- టీడీపీ మండల అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ మండల అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు

పాయకరావుపేట, మార్చి 28 : రానున్న ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి వంగలపూడి అనిత గెలుపు కోసం కలసి పనిచేద్దామని టీడీపీ మండల అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు అన్నారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పెదిరెడ్డి చిట్టిబాబు మాట్లాడుతూ నారా చంద్రబాబునాయుడు రాష్ట్రానికి ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమన్నారు. అధికార పార్టీ నాయకులు గ్రామాల్లో ఓటర్లను ప్రలోభాలకు గురిచేయకుండా చూడాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందన్నారు. అనంతరం టీడీపీ శంఖారావం, సూపర్ సిక్స్ పథకాలపై ప్రచారం తదితర అంశాలపై చర్చించారు. ఈ సమావేశంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు పెదిరెడ్డి శ్రీను, జనసేన నాయకుడు దేవవరపు రఘు, జనసేన మండల అధ్యక్షుడు ఎగదాసి నానాజీ, బీజేపీ మండల అధ్యక్షుడు వేముల వెంకటేశ్వరరావు, టీడీపీ నాయకులు కంకిపాటి వెంకటేశ్వరరావు, పల్లా విలియంకేరి, ముజ్జూరి నారాయణరావు, ఉరుకుట్ల వెంకటరమణ, ఎం.రమాకుమారి, పెదిరెడ్డి నాగవెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

సీఎం రమేశ్ స్వాగతానికి తరలిరండి : సుందరపు

రాంబిల్లి, మార్చి 28 : ఈనెల 29 అనకాపల్లి వస్తున్న బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్‌కు ఘన స్వాగతం పలికేందుకు పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో తరలిరావాలని జనసేన ఎలమంచిలి అభ్యర్థి సుందరపు విజయకుమార్ పిలుపునిచ్చారు. గురువారం హరిపురం జనసేన పార్టీ కార్యాలయంలో జరిగిన నియోజకవర్గ పార్టీ నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు ఉదయం 9 గంటలకు లంకెలపాలెం చేరుకొని సీఎం రమేశ్‌కు స్వాగతం పలకాలన్నారు. అక్కడ నుంచి వెయ్యి కారులు, ద్విచక్రవాహనాలతో ర్యాలీగా అనకాపల్లిలోని అమ్మవారి ఆలయానికి చేరుకోవడం జరుగుతుందన్నారు. అనంతరం అనకాపల్లిలో జరిగే సమావేశంలో ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్ మాట్లాడుతారన్నారు. ఎలమంచిలి నియోజకవర్గంలో కూటమి అభ్యర్థి విజయమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు పనిచేయాలని విజయకుమార్ అన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ మాజీ సభ్యులు జనపరెడ్డి శ్రీనివాసరావు, జనసేన పార్టీ అచ్యుతాపురం రాంబిల్లి, ముగనపాక, ఎలమంచిలి మండలాల అధ్యక్షులు బైలపూడి శ్రీరామరాసు, పప్పల నూకన్నదొర, టెక్కలి పరశురామ్, బి.శ్రీనివాసరావు, అన్నం బాబ్జి, నాయకులు పైలరామునాయుడు, లాలం చందు, ఎం. త్రివేణి పాల్గొన్నారు.

వైభవంగా మరిడిమాంబ ఆలయ ప్రారంభం

పరవాడ, మార్చి 28 : రావాడ పంచాయతీ పరిధి జల్లెలపాలెంలో నూతనంగా నిర్మించిన మరిడిమాంబ ఆలయ ప్రారంభం గురువారం వైభవంగా జరిగింది. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని అమ్మవారికి పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మాజీ ఎంపీపీ పైలా జగన్నాథరావు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బండారు అప్పలనాయుడు తదితరులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఇరువురికి ఆలయ కమిటీ ప్రతినిధులు అమ్మవారి చిత్రపటాలను బహూకరించారు. ఈ సందర్భంగా అన్నసమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు అట్టా సన్యాసిఅప్పారావు, వియ్యపు చిన్న, ఇందల కొండలరావు, పైలా చినఅక్కునాయుడు, రొంగలి గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గౌరీ పరమేశ్వరుల విగ్రహ ప్రతిష్ఠ



గౌరీ పరమేశ్వరులను దర్శించుకుంటున్న రత్నాకర్

అనకాపల్లి టౌన్, మార్చి 28 : స్థానిక చిననాలుగురోడ్ల జంక్షన్ వద్ద గల కుంచావారి గౌరీ పరమేశ్వరుల ఆలయంలో పంచలోహ ఉత్సవ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం గురువారం శాస్త్రోక్తంగా జరిగింది. విరాళదాత ప్రముఖ వ్యాపారవేత్త మావూరి వెంకటరమణ, పద్మావతి ఆర్థిక సాయంతో తయారు చేసిన ఈ పంచలోహ విగ్రహానికి 108 కలశ సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు, హోమాలను నిర్వహించారు. గౌరీ పరమేశ్వరులను మాజీమంత్రి కొణతాల రామకృష్ణ, టీడీపీ ఉమ్మడి విశాఖ జిల్లా మాజీ అధ్యక్షుడు దాడి రత్నాకర్ దర్శించుకున్నారు. ప్రముఖ బిల్డర్ కాండ్రేగుల నాయుడు, భాగ్యలక్ష్మి దంపతుల ఆర్థిక సాయంతో ఏర్పాటు చేసిన అన్నసమారాధనను రత్నాకర్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ ఎం.వీరభద్రరావు, గౌరవాధ్యక్షుడు కోరుకొండ సాంబశివరావు, పాండ్రంకి సత్యారావు, కొమ్మోజి రామకృష్ణ పాల్గొన్నారు.

దివ్యాంగులకు రైల్వే రాయితీ పాసులు ఇవ్వాలి

అనకాపల్లి టౌన్, మార్చి 28: దివ్యాంగుల రైల్వేరాయితీ పాసులు మంజూరు చేయాలని టీడీపీ దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షుడు కసిరెడ్డి అర్జున్ కోరారు. పాసుల కోసం పలు దఫాలు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకుంటున్నప్పటికీ ఫలితం దక్కడం లేదని విజయవాడ రైల్వే మేనేజర్ దృష్టికి తీసుకువెళ్లినట్టు చెప్పారు. దివ్యాంగులకు ఇచ్చే రైల్వే రాయితీ పాసులు ఆన్‌లైన్‌లో కాకుండా స్వయంగా దరఖాస్తు చేసుకునే విధానం ప్రవేశపెట్టాలని కోరినట్టు అర్జున్, ప్రతినిధులు వినయ్‌కుమార్, సతీష్, గోవింద తెలిపారు.

ఘనంగా దుర్గమాంబ పండగ



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

పరవాడ, మార్చి 28: పి.బోనంగిలో దుర్గమాంబ అమ్మవారి పండగ గురువారం ఘనంగా జరిగింది. ఉదయం ఆరు గంటల నుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకొని ముడుపులు, మొక్కుబడులు చెల్లించుకున్నారు. సర్పంచ్ బండారు కల్పన, మాజీ సర్పంచ్ రాయవరపు దేముడు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు డెక్క శ్రీనివాసరావు, స్థానిక నాయకులు బండారు రాజశేఖర్, ఎం. సూరిబాబు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం అమ్మవారి ఘటాలను పురవీధుల్లో మేళతాళాలతో ఊరేగించి అనంతరం ఆలయం వద్ద అనుపోత్సవం నిర్వహించారు.

గ్రామాల్లో కేంద్ర బలగాల కవాతు

నక్కపల్లి, మార్చి 28: సార్వత్రిక ఎన్నికల ప్రక్రియను సజావుగా నిర్వహించేందుకు గురువారం సీఐ విజయ్‌కుమార్ పర్యవేక్షణలో పలు గ్రామాల్లో కేంద్ర బలగాలు కవాతు నిర్వహించాయి. మండలంలోని సీతంపాలెం, ఉపమాక, డీఎల్‌పురం, చినదొడ్డిగల్లు, సారిపల్లివానిపాలెం,రాజయ్యపేట, ఉద్దండపురం, వేంపాడు గ్రామాల్లో ఉదయం నుంచి సాయంత్రం వరకూ కవాతు నిర్వహించారు.

విద్యార్థుల సంక్షేమమే యూటీఎఫ్ లక్ష్యం

పాయకరావుపేట/రూరల్, మార్చి 28 : పదో తరగతి విద్యార్థులకు ఎస్ఎస్‌సీ మోడల్ టెస్టు పేపర్లు అందిస్తూ విద్యార్థుల సంక్షేమమే లక్ష్యంగా తమ సంస్థ పనిచేస్తోందని యూటీఎఫ్ మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులు కట్టా శ్రీరామచంద్రమూర్తి, బీవీవీ.రమణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ఏడాది ఇచ్చిన మోడల్ టెస్టు పేపర్లలో 70 నుంచి 80 శాతం మార్కులకు ప్రశ్నలు రావడం అభినందనీయ మన్నారు. ఈ టెస్టు పేపర్లు మండలంలోని 8 ఉన్నత పాఠశాలల్లోని 450 మంది విద్యార్థులకు అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా సహాధ్యక్షులు కట్టా శ్రీనివాసరావు, జిల్లా కోశాధికారి జేవీఎన్‌పీ.రాజేష్, జి.సతీష్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ముత్యాలమ్మతల్లి అనుపోత్సవం



అమ్మవారిని దర్శించుకునేందుకు బారులు తీరిన భక్తులు

సబ్బవరం, మార్చి 28: మండలంలోని అంతకాపల్లి, బంగారమ్మపాలెంల్లో కొలువైన ముత్యాలమ్మతల్లి అమ్మవారి అనుపోత్సవం గురువారం వైభవంగా జరిగింది. ఉదయం 4 గంటల నుంచే అమ్మవారిని భక్తులు దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటుచేశారు. సాయంత్రం మేళతాళాలు, బాణసంచా పేలుళ్లతో అమ్మవారి ఊరేగింపు కనుల పండువలా సాగింది. వీఆర్వోల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్‌టీ రామకాసు, పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్, వీకేపీసీపీఐఆర్ చైర్మన్ చొక్కాకుల వెంకటరావు, సర్పంచ్ సబ్బవరపు నారాయణమూర్తి, వైస్ ఎంపీపీ చొక్కాకుల గోవింద, మాజీ ఎంపీపీ ఎస్ ముత్యాలనాయుడు, మాజీ సర్పంచ్ ఎస్. దేముడు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

ఎన్నికల నిబంధనలు తప్పక పాటించాలి : ఆర్ఓ

ఎలమంచిలి, మార్చి 28 : రానున్న సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా రాజకీయ పక్షాల నేతలు ఎన్నికల కమిషన్ నిబంధనలను విధిగా పాటించాలని ఎలమంచిలి నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి మనోరమ అన్నారు. గురువారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో రాజకీయ పక్షాల నేతలతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఎన్నికల ప్రచారానికి విధిగా అనుమతులు తీసుకోవాల్సిందేనన్నారు. నామినేషన్ ప్రక్రియ మొదలుకుని ప్రచార సామగ్రికి అనుసరించాల్సిన విధానాలను వివరించారు. రాజకీయ పక్షాలకు చెందిన ప్రతినిధుల సందేహాలను నివృత్తి చేశారు.

'ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి'

కశింకోట, మార్చి 28 : శాంతియుత వాతావరణంలో ఎన్నికలు సజావుగా జరిగేలా గ్రామస్థులంతా సహకరించాలని తహసీల్దార్ మధుసూదన, ఎంపీడీవో శేషుబాబు, సీఐ వినోద్‌బాబు కోరారు. గురువారం ఉగ్గినపాలెం గ్రామంలో ఎన్నికల నియమావళిపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు గ్రామస్థులకు, యువకులకు పలు సూచనలు చేశారు. ఎన్నికల్లో ఎటువంటి వివాదాలకు, కొట్లాటలకు పాల్పడవద్దన్నారు. నగదు, మద్యం, కానుకలు పంపిణీకి యువత దూరంగా ఉండాలన్నారు. .

సీఎం రమేశ్‌కు ఘన స్వాగతం పలకండి

కోటవురట్ల, మార్చి 28: బీజేపీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్‌కు స్వాగతం పలికేందుకు శుక్రవారం ఉదయం 9గంటలకు బీజేపీ,జనసేన, టీడీపీ శ్రేణులు లంకాపాలెం తరలిరావాలని టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి లాలం కాశీనాయుడు కోరారు. అక్కడి నుంచి కార్లు ర్యాలీగా సీఎం రమేశ్‌ను అనకాపల్లి తీసుకొస్తామన్నారు. కూటమి శ్రేణులతో పరిచయం కార్యక్రమం జరుగుతుందన్నారు.

21 వ వార్డు వైసీపీ నేతలు జనసేనలో చేరిక

ఎలమంచిలి, మార్చి 28: నియోజకవర్గంలో జనసేన పార్టీలో చేరికలు జోరందుకున్నాయి. గురువారం మునిసిపాలిటీ 21వ వార్డు మంత్రిపాలెంలో జనసేన అభ్యర్థి విజయ్‌కుమార్ సమక్షంలో 30 మందికి పైగా వైసీపీకి చెందిన యువకులు జనసేన పార్టీలో చేరినట్టు కోర్ కమిటీ ప్రతినిధి పల్లా సత్యనారాయణ తెలిపారు. వీరందరికీ సుందరపు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో జనసేన నేతలు బొద్దపు శ్రీను, జనపరెడ్డి శ్రీను, బైలపూడి శ్రీరామదాసు, అన్నం బాబ్జీ, శ్రీవేణి, చొప్పా శ్రీను పాల్గొన్నారు.

అధికారులకు చెత్తశుద్ధి ఏది?

... 3వ పేజీ తరువాయి

చుట్టారు. కాగా స్వచ్ఛభారత్, స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్‌లో భాగంగా సాలిడ్‌వేస్ట్ మేనేజ్‌మెంట్ పథకంలో తడి, పొడి చెత్తను వేరు చేయాలి. తడి ద్వారా సేంద్రియ ఎరువు తయారు చేసి రైతులకు రాయితీ మీద సరఫరా చేయాలి. 2017 ఆగస్టులో క్యూబ్ బయో ఎనర్జీ ప్రైవేటు లిమిటెడ్ సంస్థకు కంపోస్టు యార్డు నిర్వహణ బాధ్యతలు అప్పగించారు. ఈ సంస్థలో మునిసిపాలిటీ చేసుకున్న ఒప్పందం ప్రకారం రోజుకి 10 టన్నుల తడి చెత్తను అప్పగించాలి. వార్డుల్లో తడి, పొడి చెత్త సేకరణ జరగకపోవడంతో పూర్తిస్థాయిలో తడి చెత్తను సరఫరా చేయలేకపోతున్నారు. దీంతో నామమాత్రంగా సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ కంపోస్టు యార్డునడుపుతున్నారు.

రోడ్డు లేదని ఇప్పటి వరకు వంకలు

కంపోస్టు యార్డులోకి చెత్తను తరలించడానికి రోడ్డు లేదని అధికారులు వంకలు చెప్పుకుంటూ వచ్చారు. ఇప్పుడు రోడ్డు అందుబాటులోకి వచ్చింది. గత నెలలో భూసేకరణ ద్వారా రైతుకు రూ.10 లక్షలు చెల్లించి రోడ్డుకి అవసరమైన 15 సెంట్లు స్థలాన్ని తీసుకున్నారు. లింగాపురం గ్రామానికి, కంపోస్టు యార్డుకి ఉపయోగపడే విధంగా 20 అడుగులు వెడల్పున 378 అడుగులు పొడవున రోడ్డు ఏర్పాటు చేశారు. రోడ్డు అందుబాటులోకి వచ్చినా పట్టణంలో చెత్త సమస్య పరిష్కారం కాలేదు.

తడి, పొడి చెత్త సేకరణ ఏదీ?

నర్సీపట్నం మునిసిపాలిటీలోని 28 వార్డుల్లో 19,670 ఇళ్లు ఉన్నాయి. తడి, పొడి, ప్రమాదకర చెత్తను వేర్వేరుగా అందించడానికి ప్రతీ ఇంటికి మూడు డస్ట్‌బిన్‌లు పంపిణీ చేయడానికి ఏడాదిన్నర క్రితం 60 వేల ప్లాస్టిక్ డబ్బాలు రూ.31.58 లక్షలతో కొనుగోలు చేశారు. తడి, పొడి చెత్త సేకరణలో ప్రజారోగ్య విభాగం అధికారులు నిర్లక్ష్యం కారణంగా పథకం నీరుగారిపోయింది. కాగా కాంట్రాక్టు పొందిన విజయవాడకు చెందిన తరుణి అసోసియేట్స్ సంస్థ పొడి చెత్త తరలించడం లేదు. దీంతో కంపోస్ట్ యార్డులో పొడి చెత్త కొండలా పేరుకుపోయింది. దీనిపై శానిటరీ ఇన్‌స్పెక్టర్ చిట్టిబాబును వివరణ కోరగా కంపోస్ట్‌యార్డు లోపల వాహనాలు రాకపోకలకు సీసీ రోడ్డు నిర్మించలేదని తెలిపారు. పొడి చెత్తను అక్కడ నుంచి తరలించేందుకు ఇంజనీరింగ్ విభాగం చర్యలు తీసుకోవాలని చెప్పారు.

బాదుడే బాదుడు

... 3వ పేజీ తరువాయి

అదేస్థాయిలో పెంచుతున్నారు. దీంతో అద్దె ఇళ్లలో నివాసం ఉండే సామాన్యులు, మధ్య తరగతికి చెందిన ప్రజలు, చిరుద్యోగులు ఇబ్బందిపడుతున్నారు. అలాగే కొత్తవిధానంలో ప్లాన్‌కు విరుద్ధంగా నిర్మించే ఇళ్లకు అదనంగా పన్ను విధిస్తున్నారు. జీవీఎంసీ జారీచేసిన ప్లాన్‌ను పది శాతం ఉల్లంఘించిన ఇళ్లకు అపరాధ రుసుముగా 25 శాతం, పది శాతం మించి 25 శాతంలోపు ఉల్లంఘించి నిర్మించినట్టయితే 50 శాతం, ప్లాన్‌ను 25 శాతం కంటే ఎక్కువ ఉల్లంఘించి నిర్మాణం చేసినట్టయితే వంద శాతం అదనంగా పన్ను విధిస్తున్నారు. నగరంలో నిర్మించే భవనాల్లో 90 శాతం భవనాలు ప్లాన్‌ను ఉల్లంఘించే నిర్మాణం చేస్తుండడంతో ఆస్తి పన్ను మరింతగా పెరిగి, అదేస్థాయిలో అద్దెలు పెరిగేందుకు దోహదమవుతోంది.

జిల్లాలో పోస్టల్ బ్యాలెట్ ఓటర్లు 28,821 మంది

... 3వ పేజీ తరువాయి

అయిన తరువాత పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకోవాల్సి ఉంటుంది. పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకునే ఓటర్లు తమ ఓటు ఏ అసెంబ్లీ నియోజకవర్గంలో ఉందో ముందుగా తెలుసుకొని ఎన్నికల నోటిఫికేషన్ విడుదల తరువాత సంబంధిత రిటర్నింగ్ అధికారులకు 12డీ ఫారం ద్వారా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. గతంలో పోస్టల్ బ్యాలెట్ ఇంటి దగ్గర వేసిన తరువాత దానిని కవర్‌లో పెట్టి సీల్ వేసి లోక్‌సభ నియోజకవర్గం అయితే కలెక్టరేట్‌లోనూ, అసెంబ్లీ అయితే సంబంధిత రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో ఏర్పాటుచేసే బాక్సుల్లో వేసేవారు. ఈ విధానాన్ని ఎన్నికల కమిషన్ మార్పు చేసింది. ఈసారి ఫెసిలిటేషన్ సెంటర్‌లో ఓటు హక్కు వినియోగించుకోవాల్సి ఉంటుంది. మిలట్రీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్, పారా మిలట్రీలో పనిచేసే సర్వీసు ఓటర్లకు ఈ పర్యాయం ఎలక్ట్రానిక్ విధానంలో ఓటు హక్కు వినియోగించే అవకాశం కల్పించారు.

ఎర్రవరంలో దాడుల నేపథ్యంలో పీస్ కమిటీ

▸▸ టీడీపీ- వైసీపీ వర్గాలతో ఇన్‌చార్జి డీఎస్పీ అప్పలరాజు సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న నర్సీపట్నం ఇన్‌చార్జి డీఎస్పీ అప్పలరాజు

గొలుగొండ, మార్చి 28 : గ్రామాల్లో అంతా స్నేహభావంతో మెలిగి, శాంతియుత వాతావరణాన్ని నెలకొల్పాలని నర్సీపట్నం ఇన్‌చార్జి డీఎస్పీ ఎస్.అప్పలరాజు సూచించారు. మండలంలోని ఎర్రవరం గ్రామంలో టీడీపీ, వైసీపీ వర్గాల మధ్య దాడుల నేపథ్యంలో ఇరు పార్టీలకు చెందిన వారితో గురువారం రాత్రి ఆయన సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున అంతా నిబంధనలకు అనుగుణంగా వ్యవహరించాలన్నారు. గ్రామాల్లో చిన్నచిన్న తగాదాలకు ఒకరిపై ఒకరు దాడులకు దిగడం సరికాదన్నారు. గ్రామంలో ఎవరికైనా మరొకరి వల నష్టం జరిగితే నేరుగా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలన్నారు. అనంతరం ఇరు వర్గాలకు చెందిన 11 మందితో పీస్ కమిటీని ఏర్పాటు చేశారు. గ్రామంలో జరిగిన దాడులపై ఇరువర్గాలపై కేసులు నమోదు చేసినట్టు చెప్పారు. ఈ సమావేశంలో నర్సీపట్నం రూరల్ సీఐ హరి, ఎస్ఐలు కృష్ణారావు, నారాయణరావు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ప్రధాన రహదార్లలో పోలీసులు వాహన తనిఖీలు



వాహనాన్ని తనిఖీ చేస్తున్న పోలీసులు

రావికమతం, మార్చి 28 : మండలంలోని చినపాచిల, రావికమతం, కొత్తకోట గ్రామాల వద్ద గల ప్రధాన రహదార్లలో గురువారం పోలీసులు విస్తృతంగా వాహనాల తనిఖీలు చేపట్టారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో డబ్బు, మద్యం, ఓటర్లను ఆకట్టుకునేందుకు ఇతర బహుమతుల తరలింపును అడ్డుకునేందుకు ఈ చర్యలు చేపట్టినట్టు రావికమతం, కొత్తకోట ఎస్ఐలు ధనుంజయనాయుడు, లక్ష్మణరావు తెలిపారు.

బాదుడే బాదుడు

... 3వ పేజీ తరువాయి

అదేస్థాయిలో పెంచుతున్నారు. దీంతో అద్దె ఇళ్లలో నివాసం ఉండే సామాన్యులు, మధ్య తరగతికి చెందిన ప్రజలు, చిరుద్యోగులు ఇబ్బందిపడుతున్నారు. అలాగే కొత్తవిధానంలో ప్లాన్‌కు విరుద్ధంగా నిర్మించే ఇళ్లకు అదనంగా పన్ను విధిస్తున్నారు. జీవీఎంసీ జారీచేసిన ప్లాన్‌ను పది శాతం ఉల్లంఘించిన ఇళ్లకు అపరాధ రుసుముగా 25 శాతం, పది శాతం మించి 25 శాతంలోపు ఉల్లంఘించి నిర్మించినట్టయితే 50 శాతం, ప్లాన్‌ను 25 శాతం కంటే ఎక్కువ ఉల్లంఘించి నిర్మాణం చేసినట్టయితే వంద శాతం అదనంగా పన్ను విధిస్తున్నారు. నగరంలో నిర్మించే భవనాల్లో 90 శాతం భవనాలు ప్లాన్‌ను ఉల్లంఘించే నిర్మాణం చేస్తుండడంతో ఆస్తి పన్ను మరింతగా పెరిగి, అదేస్థాయిలో అద్దెలు పెరిగేందుకు దోహదమవుతోంది.

పోస్టల్ బ్యాలెట్ ఓటర్లు 28,821 మంది

... 3వ పేజీ తరువాయి

అయిన తరువాత పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకోవాల్సి ఉంటుంది. పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకునే ఓటర్లు తమ ఓటు ఏ అసెంబ్లీ నియోజకవర్గంలో ఉందో ముందుగా తెలుసుకొని ఎన్నికల నోటిఫికేషన్ విడుదల తరువాత సంబంధిత రిటర్నింగ్ అధికారులకు 12డీ ఫారం ద్వారా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. గతంలో పోస్టల్ బ్యాలెట్ ఇంటి దగ్గర వేసిన తరువాత దానిని కవర్‌లో పెట్టి సీల్ వేసి లోక్‌సభ నియోజకవర్గం అయితే కలెక్టరేట్‌లోనూ, అసెంబ్లీ అయితే సంబంధిత రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో ఏర్పాటుచేసే బాక్సులో వేసేవారు. ఈ విధానాన్ని ఎన్నికల కమిషన్ మార్పు చేసింది. ఈసారి ఫెసిలిటేషన్ సెంటర్‌లో ఓటు హక్కు వినియోగించుకోవాల్సి ఉంటుంది. మిలటరీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్, పారా మిలటరీలో పనిచేసే సర్వీసు ఓటర్లకు ఈ పర్యాయం ఎలక్ట్రానిక్ విధానంలో ఓటు హక్కు వినియోగించే అవకాశం కల్పించారు.

అధికారులకు చెత్తశుద్ధి ఏది?

... 3వ పేజీ తరువాయి

చుట్టారు. కాగా స్వచ్ఛ భారత్, స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్‌లో భాగంగా సాలిడ్‌వేస్ట్ మేనేజ్‌మెంట్ పథకంలో తడి, పొడి చెత్తను వేరు చేయాలి. తడి ద్వారా సేంద్రియ ఎరువు తయారు చేసి రైతులకు రాయితీ మీద సరఫరా చేయాలి. 2017 ఆగస్టులో క్యూబ్ బయో ఎనర్జీ ప్రైవేటు లిమిటెడ్ సంస్థకు కంపోస్టు యార్డు నిర్వహణ బాధ్యతలు అప్పగించారు. ఈ సంస్థలో మునిసిపాలిటీ చేసుకున్న ఒప్పందం ప్రకారం రోజుకి 10 టన్నుల తడి చెత్తను అప్పగించాలి. వార్డులో తడి, పొడి చెత్త సేకరణ జరగకపోవడంతో పూర్తి స్థాయిలో తడి చెత్తను సరఫరా చేయలేకపోతున్నారు. దీంతో నామమాత్రంగా సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ కంపోస్టు యార్డు నడుపుతున్నారు.

రోడ్డు లేదని ఇప్పటి వరకు వంకలు

కంపోస్టు యార్డులోకి చెత్తను తరలించడానికి రోడ్డు లేదని అధికారులు వంకలు చెప్పుకుంటూ వచ్చారు. ఇప్పుడు రోడ్డు అందుబాటులోకి వచ్చింది. గత నెలలో భూసేకరణ ద్వారా రైతుకు రూ.10 లక్షలు చెల్లించి రోడ్డుకి అవసరమైన 15 సెంట్లు స్థలాన్ని తీసుకున్నారు. లింగాపురం గ్రామానికి, కంపోస్టు యార్డుకి ఉపయోగపడే విధంగా 20 అడుగులు వెడల్పున 378 అడుగులు పొడవున రోడ్డు ఏర్పాటు చేశారు. రోడ్డు అందుబాటులోకి వచ్చినా పట్టణంలో చెత్త సమస్య పరిష్కారం కాలేదు.

తడి, పొడి చెత్త సేకరణ ఏదీ?

నర్సీపట్నం మునిసిపాలిటీలోని 28 వార్డుల్లో 19,670 ఇళ్లు ఉన్నాయి. తడి, పొడి, ప్రమాదకర చెత్తను వేర్వేరుగా అందించడానికి ప్రతీ ఇంటికి మూడు డస్ట్‌బిన్‌లు పంపిణీ చేయడానికి ఏడాదిన్నర క్రితం 60 వేల ప్లాస్టిక్ డబ్బాలు రూ.31.58 లక్షలతో కొనుగోలు చేశారు. తడి, పొడి చెత్త సేకరణలో ప్రజారోగ్య విభాగం అధికారులు నిర్లక్ష్యం కారణంగా పథకం నీరుగారిపోయింది. కాగా కాంట్రాక్టు పొందిన విజయవాడకు చెందిన తరుణి అసోసియేట్స్ సంస్థ పొడి చెత్త తరలించడం లేదు. దీంతో కంపోస్ట్ యార్డులో పొడి చెత్త కొండలా పేరుకుపోయింది. దీనిపై శానిటరీ ఇన్‌స్పెక్టర్ చిట్టిబాబును వివరణ కోరగా కంపోస్ట్‌యార్డు లోపల వాహనాలు రాకపోకలకు సీసీ రోడ్లు నిర్మించలేదని తెలిపారు. పొడి చెత్తను అక్కడ నుంచి తరలించేందుకు ఇంజనీరింగ్ విభాగం చర్యలు తీసుకోవాలని చెప్పారు.

గొంతు తడవాలన్నా.. కంచం కడగాలన్నా.. ఇంటికే..!

▸▸ సమస్యల వలయంలో కొండధర్మవరం పాఠశాల ▸▸ తాగునీరు, మరుగుదొడ్డి వంటివి లేకపోవడంతో విద్యార్థులకు అవస్థలు ▸▸ పాలకులు పట్టించుకోకపోవడంపై తల్లిదండ్రులు ఆగ్రహం



కొండధర్మవరంలోని పాఠశాల భవనం



అసౌకర్యాల నడమ తరగతులు నిర్వహిస్తున్న దృశ్యం



అధ్వానంగా మారిన మరుగుదొడ్డి

నాతవరం, మార్చి 28 : అదో గిరిపల్లె. మండల కేంద్రానికి పద్దెనిమిది కిలోమీటర్ల దూరంలో కొండవారన ఉన్న ఆ గ్రామంలో నాలుగు వందలమంది వరకు జనాభా నివాసం ఉంటున్నారు. అందరూ గిరిజనులే అయినప్పటికీ తమ పిల్లలు చదువుకోవాలి, ఉన్నతంగా ఎదగాలి అన్నది వారి ఆకాంక్ష. అందులో భాగంగానే అక్కడున్న ప్రాథమిక పాఠశాలకు ప్రతిరోజూ పంపుతున్నారు. కానీ అందుకు అనుగుణంగా సౌకర్యాలు లేకపోవడంతో చదువులు సరిగా సాగడం లేదని వారంతా వాపోతున్నారు.

నాతవరం మండలం కేపీ శరభవరం పంచాయతీ శివారు కొండధర్మవరం పాఠశాలలో అన్నీ సమస్యలే. ఇక్కడ ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు పదిహేను మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. అది గిరిజన గ్రామం కావడంతో అక్కడివారంతా అష్టకష్టాలు పడి కుటుంబాలను నెట్టుకొస్తున్నారు. గ్రామంలో సౌకర్యాల మాట అటుంచితే.. కనీసం తమ పిల్లలు చదువుకునేందుకు అనువైన వాతావరణం కల్పించడంతో ప్రభుత్వం విఫలమైందని దుమ్మెత్తిపోస్తున్నారు. గతంలో ఇక్కడ పాఠాలు బోధించే ఉపాధ్యాయుడు పదవీ విరమణ పొందడంతో ఎంబీపట్నం ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న పి.వి.భాస్కర్ అనే ఉపాధ్యాయుడ్ని ఎంఈవో అమృతకుమార్ ఇక్కడ మూడు నెలల క్రితం డిప్యూటేషన్ వేశారు. ఇంతవరకు బాగానే ఉన్నా పాఠశాలలో కనీస సౌకర్యాలు కరువయ్యాయి. ఇక్కడ విద్యార్థులకు తాగునీ, మరుగుదొడ్డి వంటివి ప్రధాన సమస్యలుగా మారాయి. తాగునీరు లేకపోవడంతో తరగతి గదిలో ఉన్న వీరికి దాహం వేస్తే ఇంటికి వెళ్లి గొంతు తడుపుకుని వస్తున్నారు. మధ్యాహ్న భోజనానంతరం చేతులు, కంచాలు కడుక్కోవడానికి కూడా నీరు లేక విద్యార్థులకు అవస్థలు తప్పడం లేదంటే ఇక్కడి పరిస్థితులను అర్థం చేసుకోవచ్చు. ఇక మరుగుదొడ్డి విషయానికి వస్తే పదేళ్ల క్రితం దీనిని నిర్మించారు. ఎప్పటికప్పుడు శుభ్రం చేయకపోవడంతో ప్రస్తుతం నిరుపయోగంగా మారింది. దీంతో పాఠాలు వింటున్న విద్యార్థులు అప్పుడప్పుడు ఇళ్లకు పరుగుతీయాల్సి వస్తోంది. వీరి పరిస్థితి ఇలా ఉంటే ఉపాధ్యాయుడు అటువంటి సమయాల్లో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ఇదిలావుంటే, ఇక్కడ మధ్యాహ్న భోజనాన్ని వండేందుకు షెడ్డు వంటి సౌకర్యం లేదు. దీంతో నిర్వాహకులు ఇంటి వద్ద వంటలు వండి తెచ్చి విద్యార్థులకు వడ్డిస్తున్నారు. ఇది తమకు ఇబ్బందిగా వారిందని వారు వాపోతున్నారు. అలాగే, పాఠశాలకు ప్రహరీ గోడ లేకపోవడంతో సెలవు రోజుల్లో ఆకతాయిలు అక్కడికి చేరివాతావరణాన్ని పాడుచేస్తున్నారు. నాడు-నేడు పథకం ద్వారా పాఠశాలల రూపురేఖలు మార్చేశామని చెప్పే ప్రజాప్రతినిధులు, అధికారులకు తమ గ్రామంలో పాఠశాల దుస్థితి గుర్తుకు రాకపోవడం విచారకరమని తల్లిదండ్రులు వాపోతున్నారు. ఉన్నతాధికారులు ఇప్పటికైనా స్పందించి పాఠశాలలో సమస్యలు పరిష్కరించాల్సిందిగా వారంతా కోరుతున్నారు.

వైసీపీకి ఓటమి తప్పదు

▸▸ శంఖారావం సభల్లో మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు



జంగాలపల్లి ఎన్నికల శంఖారావం సభల మాట్లాడుతున్న అయ్యన్న

మాకవరపాలెం/నర్సీపట్నం అర్బన్, మార్చి 28 : ఐదేళ్ల పాటు రాష్ట్రంలో ప్రజా వ్యతిరేక పాలన సాగించి, అన్నివర్గాలను ఇబ్బందులకు గురిచేసిన వైసీపీకి ఈ ఎన్నికల్లో ఓటమి తథ్యమని మాజీ మంత్రి, నర్సీపట్నం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చింతకాయల అయ్యన్నపాత్రుడు స్పష్టం చేశారు. మండలంలోని జంగాలపల్లి, బీఎస్‌పేట గ్రామాల్లో గురువారం రాత్రి నిర్వహించిన ఎన్నికల శంఖారావం సభల్లో మాట్లాడారు. గ్రామాల్లో ఇసుక అక్రమ రవాణా చేస్తూ వైసీపీ నాయకులు కాసులు దండుకుంటున్నారని ఆరోపించారు. టీడీపీ హయాంలోనే గ్రామాలు అభివృద్ధి చెందాయన్నారు. మళ్లీ టీడీపీ అధికారంలోకి వస్తే చంద్రబాబు ప్రవేశపెట్టనున్న ఆరు గ్యారెంటీ పథకాలను ఓటర్లకు వివరించారు. టీడీపీ మండల అధ్యక్షుడు ఆర్.వై.పాత్రుడు, శెట్టిపాలెం సర్పంచ్ అల్లు రామునాయుడు, నాయకులు రమణ, నర్ల సత్యనారాయణ, సురేష్, బీఎస్‌పేట మాజీ సర్పంచ్ కలిగట్ల బాబూరావు, జనసేన నాయకుడు రాజాన సూర్యచంద్ర, బీజేపీ మండల అధ్యక్షుడు మర్రి నాయుడు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు. ఇదిలావుంటే, నర్సీపట్నం మండలం నీలంపేటలో అయ్యన్న సతీమణి, మునిసిపల్ కౌన్సిలర్ చింతకాయల పద్మావతి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. నియోజకవర్గ అభివృద్ధికి అయ్యన్నను గెలిపించాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నీటి ఎద్దడి నివారణకు చర్యలు



క్రాష్ ప్రోగ్రామ్‌పై ప్రచారాన్ని ప్రారంభిస్తున్న ఎంపీడీవో

మాకవరపాలెం, మార్చి 28 : వేసవిలో గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు చేపట్టాలని ఎంపీడీవో చంద్రరావు సిబ్బందికి సూచించారు. ఈ మేరకు గురువారం ఇక్కడ క్రాష్ ప్రోగ్రామ్‌ను ప్రారంభించి మాట్లాడారు. మండలంలోని 31 పంచాయతీలలో ఇరవై రోజుల పాటు ఎక్కడైనా మంచినీటి పథకాలు, బోర్లు మరమ్మతుకు గురైతే మండల పరిషత్ కార్యలయానికి తెలియజేయాలన్నారు. ఎక్కడా తాగునీటి ఎద్దడి లేకుండా చూడలన్నదే లక్ష్యంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ సీతామహాలక్ష్మి, బోరు మెకానిక్‌లు పాల్గొన్నారు.

గ్రామాల్లో కేంద్ర బలగాల కవాతు

మాకవరపాలెం, మార్చి 28 : సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు మండల కేంద్రం మాకవరపాలెంతో పాటు బూరుగుపాలెం, వజ్రగడ, లచ్చన్నపాలెం, తూటిపాల, తాడపాల, పాపయ్యపాలెం, బీఎస్‌పేట తదితర గ్రామాల్లో గురువారం కేంద్ర బలగాలు కవాతు నిర్వహించాయి. ఈ సందర్భంగా నాతవరం ఎస్ఐ రామారావు మాట్లాడుతూ ప్రజలంతా ధైర్యంగా ఓటు హక్కును వినియోగించుకోవాల్సిందిగా కోరారు. గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మల్లవరంలో ఎమ్మెల్యే గణేశ్ ప్రచారం

మాకవరపాలెం, మార్చి 28 : మల్లవరంలో గురువారం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేశ్ ప్రచారాన్ని నిర్వహించారు. గత ఐదేళ్లలో గ్రామాలను అభివృద్ధి చేసినట్టు చెప్పారు. మరోసారి తనను ఆశీర్వదించాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రుత్తల సత్యనారాయణ, వైసీపీ నాయకులు రుత్తల వాసు, మిడతాన తాతాజీ, పెట్ల భద్రాచలం తదితరులు పాల్గొన్నారు.

'విద్యార్థులు సత్ఫలితాలు సాధించాలి'

మాకవరపాలెం, మార్చి 28 : తూటిపాల ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల వార్షికోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినీ విద్యార్థులు డ్యాన్స్‌లతో అలరించారు. ఎంఈవో జాన్‌ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి మంచి ఫలితాలు సాధించాలని సూచించారు. అనంతరం గ్రామానికి చెందిన సూక్ష్మ కళాకారుడు రవికుమార్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు కోసూరు రాము, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చీడికాడలో చలివేంద్రం ప్రారంభం

చీడికాడ, మార్చి 28 : మండల కేంద్రం చీడికాడ చావిడి వద్ద గురువారం ఎంపీడీవో ఉమామహేశ్వరి చలివేంద్రాన్ని ప్రారంభించారు. సీనియర్ అసిస్టెంట్ ఉమావాణిశ్రీ, పంచాయతీ కార్యదర్శి ఎ.సన్యాసిరావు, పంచాయతీ ఉద్యోగి యర్రా సన్యాసినాయుడు తదితరులు పాల్గొన్నారు.

'బాల్య వివాహాలు చేస్తే కఠిన చర్యలు'



అవగాహన ర్యాలీలో తహసీల్దార్ తదితరులు

దేవరాపల్లి, మార్చి 28 : బాల్య వివాహాలు చేసుకోవడమే కాదు, బాలికతో సంసారం చేసినా శిక్షార్హులని తహసీల్దార్ లక్ష్మీనారాయణ అన్నారు. అంగన్‌వాడీ ప్రాజెక్టు అధికారిణి మంగతాయారు ఆధ్వర్యంలో గురువారం ఇక్కడ సమావేశాన్ని నిర్వహించారు. బాల్య వివాహాల వల్ల అనర్థాలను వివరించారు. అనంతరం నాలుగు రోడ్ల వరకు అవగాహన ర్యాలీ జరిపారు. ఏపీఎం ప్రభాకర్, సూపరింటెండెంట్ జి.వి.రమణ, ఐసీడీఎస్ పర్యవేక్షకులు, ఆస్పత్రి పర్యవేక్షకులు పాల్గొన్నారు.

కనకరత్న థియేటర్ అధినేత సురేష్ మృతి

మాడుగుల, మార్చి 28 : ఇక్కడి కనకరత్న థియేటర్ యజమాని జల్లు సురేష్ గురువారం మృతిచెందారు. గత కొద్దిరోజుల నుంచి అనారోగ్యంతో విశాఖలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్సలు పొందుతూ వేకువజామున తుది శ్వాస విడిచారు. ఆయన మృతికి సంతాపంగా మాడుగుల బస్టాండ్‌లో గల షాపులను స్వచ్ఛందంగా మూసివేసి సంతాపం తెలిపారు.

టీడీపీని గెలిపిస్తేనే సమస్యలకు పరిష్కారం

▸▸ ఇంటింటి ప్రచారంలో మాజీ ఎమ్మెల్యే రాజు



కోట వీధి ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే రాజు

చోడవరం, మార్చి 28 : సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీని గెలిపిస్తేనే ఇక్కడి సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని మాజీ ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.రాజు అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం ఆయన కోటవీధిలో ఇంటింట ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైసీపీ పాలనలో రాష్ట్రం అన్నిరంగాల్లో వెనుకబడిందన్నారు. ఎమ్మెల్యే ధర్మశ్రీ నిర్లక్ష్యం కారణంగా నియోజకవర్గ అభివృద్ధి అడుగంటిందని విమర్శించారు. మళ్లీ ఈ ప్రాంతం బాగుపడాలంటే తనకు మరో అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మడుసు గోవిందు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం మారాలని రాష్ట్ర ప్రజల ఆకాంక్ష

టీడీపీ కార్యకర్తల సమావేశంలో మాడుగుల అభ్యర్థి 'పైలా'



నందిపల్లిలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న పైలా ప్రసాదరావు

దేవరాపల్లి, మార్చి 28 : రాష్ట్ర ప్రజలు ఈసారి ప్రభుత్వ మార్పును కోరుకుంటున్నారని టీడీపీ మాడుగుల ఎమ్మెల్యే అభ్యర్థి పైలా ప్రసాదరావు అన్నారు. మండలంలోని పెద నందిపల్లిలో గురువారం పార్టీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ఐదేళ్ల పాటు ప్రజా వ్యతిరేక పాలన సాగించిన వైసీపీకి ఎన్నికల్లో ఓటు ద్వారా బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. యువత భవిష్యత్తుకు సీఎం జగన్ భరోసా ఇవ్వలేకపోయారని మండిపడ్డారు. ప్రస్తుతం రాష్ట్రం అన్ని రంగాల్లో బాగుపడాలంటే ఉమ్మడి అభ్యర్థులను అంతా గెలిపించుకోవాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఓటు హక్కుపై గ్రామాల్లో అవగాహన ర్యాలీ




చోడవరంలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వివిధ శాఖల ఉద్యోగులు

చోడవరం, మార్చి 28 : ఓటు హక్కును అంతా స్వేచ్ఛగా వినియోగించుకోవాలని కోరుతూ గురువారం పట్టణంలో వివిధ శాఖల అధికారులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎవరూ ఎటువంటి ప్రలోభాలకు లొంగకుండా ఓటు వేయాలన్నారు. అర్హులైన వారికి ఓటు హక్కు లేకుంటే కొత్తగా నమోదు చేసుకోవాలని సూచించారు. అంతా ఎన్నికల నిబంధనలు విధిగా పాటించాలని కోరారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగితే శాఖా పరమైన చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో రిటర్నింగ్ అధికారి ఏజీ చిన్నికృష్ణ, తహసీల్దార్ వేణుగోపాల్ తదితరులతో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రోలుగుంటలో...

రోలుగుంట : సార్వత్రిక ఎన్నికల్లో అర్హులంతా ఓటు హక్కును వినియోగించుకోవాల్సిందిగా తహసీల్దార్ రవిచంద్ర సూచించారు. గురువారం రోలుగుంటలో ఓటు వినియోగంపై నిర్వహించిన అవగాహన ర్యాలీలో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ రామ్మూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

చీడికాడలో ముత్యాలమ్మ విగ్రహ ప్రతిష్ఠ



చీడికాడ, మార్చి 28 : మండల కేంద్రం చీడికాడలో ముత్యాలమ్మ విగ్రహాన్ని గురువారం అత్యంత భక్తిశ్రద్ధలతో ప్రతిష్ఠించారు. కరణం గారి కుటుంబ ఇల వేల్పుగా విరాజిల్లుతున్న అమ్మవారికి ఈ సందర్భంగా పురోహితులు గరిమెళ్ల ఈశ్వరశర్మ ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించారు. ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు, మాడుగుల మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పైలా ప్రసాదరావు తదితరులతో పాటు వివిధ పార్టీ నాయకులు యర్రా అప్పారావు, పోతల రమణమ్మ, గొల్లవిల్లి రాజబాబు, పరవాడ మహేష్, రెడ్డి సన్యాసినాయుడు, గండి ముసలినాయుడు, కె.శ్రీరామ్మూర్తి తదితరులు దర్శించుకున్నారు.

ఆలయ నిర్మాణానికి 'గవిరెడ్డి' విరాళం



విరాళాన్ని అందిస్తున్న గవిరెడ్డి రామానాయుడు

మాడుగుల, మార్చి 28 : తాటిపర్తిలో నూతనంగా నిర్మిస్తున్న సీతారాముల ఆలయానికి మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు రూ.15వేలు విరాళం అందజేశారు. గురువారం గ్రామంలో పర్యటించిన సందర్భంగా ఆలయ నిర్మాణ పనులను పరిశీలించారు. మాజీ ఎంపీపీ ఓంద్రు గంగమ్మ, కృష్ణ, నాయకులు గొల్లవిల్లి శ్రీరామూర్తి, శంకరరావు, ఢిల్లీ నానాజీ, వేగి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

750 మంది బైండోవర్ : ఎస్ఐ

మాడుగుల, మార్చి 28 : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మండలంలో 750 మందిని బైండోవర్ చేసినట్టు ఎస్ఐ పి.దామోదరనాయుడు తెలిపారు. గురువారం అయన విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తల్లో భాగంగా ఈ చర్యలు చేపట్టినట్టుచెప్పారు. సమస్యాత్మక గ్రామాలను గుర్తించి, వాటిపై ప్రత్యేక దృష్టిసారించామన్నారు. అన్ని పార్టీలకు చెందిన నాయకులను బైండోవర్ చేసినట్టు వివరించారు. ఎన్నికల నియమావళిని అంతా విధిగా పాటించాలని సూచించారు.

బాల వరసిద్ధి వినాయ ఆలయంలో పూజలు



ఆలయంలో అర్చకుల హోమం

రావికమతం, మార్చి 28 : సంకష్టహర చతుర్థి పర్వ దినాన్ని పురస్కరించుకుని టి.అర్జాపురం బాల వరసిద్ధి వినాయక ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు గుంటూరు లక్ష్మణశర్మ, రామారావు ఆధ్వర్యంలో పంచామృతాభిషేకాలు, లక్ష్మీగణపతి హోం జరిపారు. ఈ వేడుకల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కొత్త అమావాస్య జాతరకు సన్నాహాలు



నర్సీపట్నం, మార్చి 28 : పట్టణంలోని అబీద్ సెంటర్‌లో గల నూకాలమ్మ ఆలయంలో కొత్త అమావాస్య జాతర ఉత్సవాలకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఏప్రిల్ రెండో తేదీన మొదటి జాగారం, నాలుగో తేదీన రెండో జాగారం, ఏడో తేదీ రాత్రి పెద్ద జాగారం నిర్వహిస్తామని దేవదాయ శాఖ కార్యనిర్వాహక అధికారి గంగారావు తెలిపారు. ఎనిమిదో తేదీన కొత్త అమావాస్య పండగ జరపనున్నామన్నారు.

బయ్యవరంలో మావుళ్లమ్మ పండగ

మాకవరపాలెం, మార్చి 28 : బయ్యవరంలో మావుళ్లమ్మ పండగను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్థులతో పాటు పరిసరాలవారు పెద్ద సంఖ్యలో విచ్చేసి దర్శించుకున్నారు. మధ్యాహ్నం అన్నసమారాధన జరిపారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని మేళతాళాలు, బాజాభజంత్రీల నడుమ గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. సర్పంచ్ కాశీ విశ్వనాథ్‌తో పాటు ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక పెద్దలు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ములకలాపల్లిలో మోదమాంబ వేడుక

దేవరాపల్లి, మార్చి 28 : ములకలాపల్లిలో మోదమాంబ ఆలయ పంచమ వార్షికోత్సవాన్ని గురువారం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువజాము నుంచి అమ్మవారికి విశేష పూజలు జరిపారు.

చౌడువాడలో అమ్మవార్ల ఆలయ వార్షికోత్సవం

కె.కోటపాడు, మార్చి 28 : చౌడువాడలో మరిడిమాంబ, బంగారమ్మ ఆలయ ద్వితీయ వార్షికోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవార్లకు విశేష పూజలు నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. అర కిలో వెండి హారాన్ని మునగపాక ఎంపీపీ జయమ్మ ఆలయానికి అందజేశారు. సర్పంచ్ దాడి ఎరుకునాయుడు, శిల్పరశెట్టి వెంకటరావు, కమిటీ సభ్యులు శిల్పరశెట్టి ముసలినాయుడు, మళ్ళ సూరిబాబు, వెంకటరమణ, రామునాయుడు పాల్గొన్నారు.